ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
20 కుమరం భీం
గురువారం 17 ఆగస్టు 2017

ఇదో 'హరిత' ఠాణా!



ఈసుగాం పోలీసు స్టేషన్

నందనవనంలా ఈసుగాం పోలీస్‌స్టేషన్

పూల మొక్కలు, పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం

- కాగజ్‌నగర్ రూరల్

మధ్య పేజీల్లో..


రెబ్బెన మండలం కొండపల్లిలో బోదకాలతో బాధితులు


మొగడ్‌దగడ్‌లో బోరు వద్ద పేరుకుపోయిన మురికి నీరు

ఆంధ్రజ్యోతి పరిశీలన

'క్యూలెక్స్' కాటేస్తోంది..

- కుమరం భీం జిల్లాలో పెరుగుతున్న ఫైలేరియా బాధితులు
- రెండు గ్రామాల్లోనే 50 మందికి పైగా బాధితులు
- ప్రభావం చూపని నియంత్రణ కిట్లు
- ఏటేటా పెరుగుతున్న రోగుల సంఖ్య
- అవగాహన లోపమే అసలు సమస్య

జిల్లా ప్రజలను క్యూలెక్స్ దోమ కాటువేస్తోంది. ఈ దోమలు కొండ ప్రాంతాలు, నీటి మడుగుల సమీపంలో ఎక్కువగా ఉంటాయి. అవి కాటువేయడంతో జ్వరంతోపాటు వాపు వస్తుంది. జిలాల్లో ఏటా బోదకాలు బాధితుల సంఖ్య పెరుగుతోంది. రెబ్బెన మండలం కొండపల్లి, కౌటాల మండలం మొగడ్‌దగడ్ గ్రామాల్లో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంది. రెండు గ్రామాల్లో కలిపి 50 మందికి పైగా బోదకాలు వ్యాధితో బాధపడుతున్నట్లు 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో తేలింది. నివారణ చర్యల్లో భాగంగా అధికారులు అందజేస్తున్న మెడికల్ కిట్లు పనిచేయడం లేదని బాధితులు వాపోతున్నారు. డీఈసీ మాత్రలు అక్కడక్కడా వికటిస్తుండడం వల్ల వేసుకునేందుకు ప్రజలు జంకుతున్నారు. ఫలితంగా కొత్త వారికి కూడా వ్యాధి సోకుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, ఆసిఫాబాద్)

9లో

వంజరిగూడలో మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం

- కొలాం గిరిజన గ్రామాన్ని సందర్శించిన అధికారులు


మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్, ఎస్సై

7లో

సత్తాచాటిన గిరిపుత్రుడు

- కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన జిల్లా విద్యార్థి



20లో

ప్రాణాంతక వ్యాధులకు టీకాతో చెక్..


- నేటి నుంచి మీజిల్స్ రుబెల్లా వ్యాక్సినేషన్ పంపిణీ


అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు(ఫైల్)

6లో

ఉన్నత విద్యకు రుణాలు

● పేద ప్రతిభావంతులకు వరం విద్యాలక్ష్మి పథకం
● ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించిన కేంద్రం



విద్యాలక్ష్మి పథకం లోగో

మంచిర్యాల టౌన్ : కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ 2015-16 కేంద్ర వార్షిక బడ్జెట్‌లో విద్యాలక్ష్మి పథకం ప్రవేశపెట్టారు. దీన్ని గతేడాది ఆగస్టు 15న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ పథకం కింద లబ్ధి పొందాలంటే ఉండాల్సిన అర్హతలు, విధి విధానాలు మీకోసం..

మీకోసం

ప్రత్యేక పోర్టల్ ద్వారా దరఖాస్తులు..

బ్యాంక్ రుణాలను పొందాలనుకునే వారు http://w.w.w.vidhyalaxmi.com.in అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. మొదటి పేజీలో రిజిస్టర్ బాక్స్‌ను క్లిక్ చేయాలి. ఆ వెంటనే మరోబాక్స్ వస్తుంది. అందులో అడిగిన పేరు, ఇతర వివరాలను నమోదు చేయాలి. దాని ఆధారంగా మరో బాక్స్ తెరవాలి. అందులో ఫిలప్ సింగిల్ ఫాం అని ఉంటుంది. దాన్ని క్లిక్ చేసి అడిగిన వివరాలను అందించాలి. ఆ తర్వాత మూడో బాక్స్‌ను తెరిచి అప్లై మల్టిపుల్ బాక్స్‌ను క్లిక్ చేయాలి. ఏ బ్యాంక్ ద్వారా రుణం పొందాలనుకుంటున్నారో సంబంధిత బ్యాంక్ దరఖాస్తు పూర్తి చేసుకుని ఆన్‌లైన్‌లోనే అప్‌లోడ్ చేసుకోవచ్చు. తర్వాత దరఖాస్తు ఏ స్థితిలో ఉంది. రుణం ఎప్పుడు వస్తుంది. ఏ మేరకు ఇస్తారు. అన్న వివరాలను కూడా ఎప్పటికప్పుడు ఈ సైట్‌లోనే మీ పాస్‌వర్డ్ ఆధారంగా తెలుసుకునే వీలుంటుంది. విద్యార్థి విద్యకు రుణాలిచ్చేవాటిలో ఎస్‌బీఐ, సెంట్రల్ బ్యాంక్, కెనరా, యూనియన్, ఆంధ్రా, ఐడీబీఐ, యూబీఐ, పంజాబ్ నేషనల్, బీవోబీ, హెచ్‌డీఎఫ్‌సీ, దేనా తదితర బ్యాంకులున్నాయి.

ఆర్థిక మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో...

విద్యా రుణాలందించే ఈ ప్రత్యేక పోర్టల్ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తుంది. ఉన్నత విద్య మానవ వనరుల అభివృద్ధి శాఖలు, భారతీయ బ్యాంకుల సంఘం (ఐబీఏ) సంయుక్త భాగస్వామ్యంతో పర్యవేక్షిస్తారు. రూ.4.5లక్షల ఆదాయం ఉన్న కుటుంబ దేశీయ విద్య రుణం తీసుకుంటే వడ్డీని ప్రభుత్వం భరిస్తుంది. రూ.7.5 లక్షల వరకు 10 శాతం, ఆపైన దాటితే 10.75 శాతం వడ్డీ విధిస్తారు. దేశీయ విద్యకు రూ.10 లక్షల వరకు ఇస్తారు. రూ.4 లక్షల వరకు ఏ విధమైన సెక్యూరిటీ లేకుండానే రుణం ఇస్తారు. ఆ మొత్తం దాటితే రూ.7.5 లక్షల వరకు మూడో వ్యక్తి నుంచి వ్యక్తిగత హామీ తీసుకుంటారు. అది కూడా దాటితే ఆస్తులను హామీగా ఇవ్వాల్సి ఉంటుంది. విదేశీ విద్యకు రూ.15 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఇస్తారు. ఎస్‌బీఐవో ఎంపిక చేసిన బ్రాంచ్ లు హార్వర్డ్ విశ్వవిద్యాలయం వంటి సంస్థల్లో సీట్లు వచ్చిన వారికి రూ.1.5 కోట్ల వరకు రుణమిచ్చే అవకాశం ఉంది.

ధ్రువీకరణ పత్రాలు ఉండాలి...


విద్యార్థి చదివిన విద్యా సంస్థ నుంచి బదిలీ ధ్రువపత్రం, మార్కుల జాబితాలు. ఇప్పటి వరకు పొందిన ఉపకార వేతన వివరాల పత్రాలు. ఉన్నత విద్య ర్యాంక్ కార్డు, ప్రవేశ అనుమతి పత్రాలు ఉండాలి. అలాగే చేయాల్సిన కోర్సు ఫీజుల అంచనా వివరాల పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

మీకోసం

'పీసీ' వేగం పుంజుకోవాలా..?



● ఈ చిట్కాలు పాటిస్తే కంప్యూటర్ పనితీరు మెరుగు



మంచిర్యాల టౌన్ : ఈ రోజుల్లో కంప్యూటర్ లేకుంటే ఎలాంటి పనులు కావడం లేదు. నిత్యం మనం చేసుకునే పనులు కంప్యూటర్‌తో ముడిపడి ఉంటాయి. ఎలాంటి పనులు చేసుకోవాలన్నా పర్సనల్ కంప్యూటర్(పీసీ)కు పని చెప్పాల్సిందే. అత్యవసరంలో కంప్యూటర్‌లు మొరాయిస్తే అనుకున్న సమయంలో పనులు కావు. చిన్నచిన్న చిట్కాలు పాటిస్తే కంప్యూటర్ పనితీరును మరింత వేగవంతం చేసుకోవచ్చు. కొన్ని కొన్ని సందర్భాల్లో కంప్యూటర్‌లోని ఫైల్స్, ఫోల్డర్లను ఓపెన్ చేస్తున్న సమయంలో పనితీరు తగ్గిపోయినట్లు కనిపిస్తుంది. అలాంటి సందర్భాల్లో పనులు తాత్కాలికంగా ఆగిపోతుంటాయి. మరి నిత్యం ఎన్నో రకాల పనులు చేసే కంప్యూటర్ పనితీరును మరింత వేగంగా చేసుకోవడానికి 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనమిది.

కంప్యూటర్ వేగం పెంచడానికి ఇలా చేయండి...

● పర్సనల్ కంప్యూటర్‌లో ఒకే ఫైల్ ఒకటి కంటే ఎక్కువ చోట్ల సేవ్ అయిన సందర్భాల్లో పనితీరు కొంత మందగిస్తుంది. ఫొటోలు, వీడియోలతో పాటు ఇతర ఫైళ్లు కూడా ఎక్కువ చోట్ల ఉండకుండా జాగ్రత్తలు పాటించాలి. అలాంటి వాటిని గుర్తించి డిలీట్ చేయడం ద్వారా హార్డ్‌డిస్క్‌లో మరింత స్పేస్‌ను పెంచుకునే అవకాశముంది. ప్రధానంగా యాప్స్, ఇతర సాఫ్ట్‌వేర్ మూలంగా ఏర్పడే జంక్‌ఫైల్స్‌లో 'టెంప రరీ' డాటా రోజురోజుకు పెరిగిపోతూ ఉంటుంది. పీసీలో ఈ ఫైల్స్ రకా రకాల 'లొకేషన్'లలో సేవ్ అవుతూ ఉంటుంది. వీటిని ఎప్పటికప్పుడు తొలగించుకుంటే పీసీ వేగం ఆటోమెటిక్‌గా పెరిగిపోతుంది. ఇందుకోసం సిస్టమ్‌లోని 'డిస్క్ క్లీనప్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. 'మై కంప్యూటర్'లోని డిస్క్‌లలో ఏదైనా ఒక డిస్క్‌పై మౌస్ ద్వారా రైట్ క్లిక్ చేస్తే 'డిస్క్ క్లీనప్' ఆప్షన్‌ను మనం గమనించవచ్చు.



● కొనుగోలు చేసిన పీసీలో ఎన్నో రకాల అప్లికేషన్లు ఉంటాయి. ఇందులో అవసరమున్నవి కొన్ని, అవసరం లేనివి మరికొన్ని ఉంటాయి. అయితే అవసరం లేని అప్లికేషన్లను సిస్టమ్ నుంచి తొలగించడం ద్వారా కంప్యూటర్ స్పీడ్‌ను పెంచుకోవచ్చు. పీసీలో అవసరం లేని అప్లికేషన్లలను ఎప్పటికప్పుడు తొలగిస్తే ఫలితముంటుంది.

● కంప్యూటర్‌లో ఉన్న డ్రైవ్‌లే కాకుండా 'ఎక్స్‌టర్నల్ డ్రైవ్'లను వినియోగించడం ద్వారా స్టోరేజీపై పడుతున్న భారాన్ని అడ్డుకోవచ్చు. పీసీ స్టోరేజీని పెంచుకోవడంలో ఇదొక మార్గంగా చెప్పవచ్చు. ఇందుకు 'ఎక్స్‌టర్నల్ డ్రైవ్'ను ఎంచుకోవాలి. ప్రధానంగా 'డ్రాప్‌బాక్స్', మైక్రోసాఫ్ట్ వన్‌డ్రైవ్', 'గూగుల్ డ్రైవ్'లాంటివి అందుబాటులో ఉన్నాయి. ఇవి 'క్లౌడ్ స్టోరేజ్' సదుపాయాన్ని సైతం కల్పిస్తున్నాయి. కంప్యూటర్‌లోని ఇంటర్నల్ డ్రైవ్‌లో గల డాటాను ఎప్పటికప్పుడు 'ఎక్స్‌టర్నల్ డ్రైవ్'లోకి మార్చుకుంటే డిస్క్‌లోని స్పేస్ ఫ్రీ అవడంతో కంప్యూటర్ వేగం మరింత పెరుగుతుంది.

● ఇంటర్నెట్‌లో లభించే 'క్లీన్ మై పీసీ' అను అప్లికేషన్ ద్వారా పీసీ వేగాన్ని కొంతమేర పెంచుకోవచ్చు. ఇది కంప్యూటర్ వేగాన్ని పెంచడానికి సహకరిస్తుంది. ఈ అప్లికేషన్‌లో ఉన్న రకరకాల 'సిస్టమ్ క్లీనింగ్ టూల్స్'ను వినియోగించి క్లీన్ చేస్తుంది. తద్వారా కంప్యూటర్ వేగం పుంజుకుంటుంది.

● కొన్ని సందర్భాల్లో 'డిస్క్ క్లీన్' చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితం ఉండకపోవచ్చు. అయితే 'హార్డ్‌డిస్క్'లో స్టోర్ అయి ఉన్న 'బ్యాడ్‌సెక్టార్స్'ను డిలీట్ చేయడం ద్వారా కంప్యూటర్ వేగం పెరుగుతుంది. ఇందుకు కంప్యూటర్‌లోని డెస్క్‌టాప్‌పై గల 'మై కంప్యూటర్' ఆప్షన్‌పై డబుల్ క్లిక్ చేయాలి. తరువాత ఏ డ్రైవ్‌లో ఎర్రర్స్ ఉన్నాయో చెక్‌చేసుకోవాలి. ఇందుకు సదరు డ్రైవ్‌ను ఎంచుకొని రైట్ క్లిక్ చేసి 'ప్రాపర్టీస్'లోకి వెళ్లాలి. ఇప్పుడు ఒక బాక్స్ డిస్‌ప్లే అవుతుంది. అందులో గల టూల్స్ ఆప్షన్‌ను ఎంచుకొని 'చెక్ నౌ' బటన్‌పై క్లిక్ చేయాలి. తరువాత మరో బాక్స్ డిస్‌ప్లే అవుతుంది. ఇందులో ఉన్న ఆప్షన్‌లలో 'ఆటోమెటికల్లీ ఫిక్స్ ఫైల్ సిస్టమ్ ఎర్రర్స్'ను ఎంచుకోవాలి.

● కంప్యూటర్‌లో సేవ్ అయ్యే 'టెంపరరీ ఇంటర్నల్ ఫైల్స్'ను ఎప్పటికప్పుడు డిలీట్ చేసుకోవాలి. ఇందుకు కంప్యూటర్‌లోని 'స్టార్ట్' బటన్‌ను క్లిక్ చేసి 'రన్' ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. ఇందులో 'టెంప్' అని ఇంగ్లీష్‌లో టైప్ చేసి ఎంటర్ నొక్కాలి. అప్పుడు మనకు తెలియని కొన్ని 'టెంపరరీ ఇంటర్నల్ ఫైల్స్' డిస్‌ప్లే అవుతాయి. వాటిని సెలక్ట్ చేసి డిలీట్ చేసేయాలి.

● పర్సనల్ కంప్యూటర్‌లో ఫైల్ సెర్చ్ చేయడానికి కొంత సమయం పడుతుంది. దీనికి 'డిస్క్ ఫ్రాగ్మెంటేషన్' కారణమవుతుంది. ఫైల్స్‌ను వెతకడానికి హార్డ్‌డిస్క్ మొత్తం సెర్చ్ చేయాల్సి ఉంటుంది. ఫలితంగా సమయం వృధా అవుతుంది. ఇలాంటప్పుడు 'డిస్క్ డిఫ్రాగ్మెంటర్' ఆప్షన్ మనకు ఉపయోగపడుతుంది. ఇందుకోసం ముందుగా 'స్టార్ట్' ఆప్షన్‌లోని 'ప్రోగ్రామ్స్'ను ఓపెన్ చేయాలి. ఇందులో గల 'యాక్సెసిరిస్'లోని 'సిస్టమ్ టూల్స్'లో గల 'డిస్క్ డిఫ్రాగ్మెంటర్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. ఇప్పుడు వచ్చిన డైలాగ్ బాక్స్‌ని సెలెక్ట్ చేసుకొని 'కాన్ఫిగర్ షెడ్యూల్ బటన్'ను సెలెక్ట్ చేసుకోవాలి. 'డీ ఫ్రాగ్మెంట్' చేయాలనుకుంటున్న డ్రైవ్స్‌ని సెలెక్ట్ చేయాలి. తరువాత 'ఎనలైజ్ డిస్క్' బటన్‌పై క్లిక్ చేయాలి. తరువాత మరో డైలాగ్ బాక్స్ ఓపెన్ అవుతుంది. ఇప్పుడు ఇందులో ఉన్న 'డిఫ్రాగ్మెంట్ డిస్క్' బటన్‌ను ఎంచుకోవాలి. ఇలా ఎంచుకున్న తరువాత మనకు రిజల్ట్ కనిపిస్తుంది. తరువాత రిపోర్టు చూడాలంటే 'వ్యూ రిపోర్టు' ఆప్షన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. ఇలా చేయడం ద్వారా కంప్యూటర్ పనితీరుపై ఎలాంటి భారం పడకుండా ఉంటుంది.

గూడెం ఆలయంలో ప్రత్యేక పూజలు..

ఆధ్యాత్మికం


కొలువు దీరిన శ్రీసత్యదేవుడు

● గూడెం శ్రీసత్యనారాయణస్వామి దేవాలయంలో ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు సుప్రబాతం, ఆరాధన, బాలబోగము.

● ఉదయం 7 గంటల నుంచి ధర్మ దర్శనము, స్వామి తీర్థప్రసాదం వితరణ అర్చకుల పూజలు

● మధ్యాహ్నం 12:15 గంటలకు స్వామివారికి మహా నివేదన, హారతి, మంత్రపుష్పం.

● గూడెం దేవస్థానాన్ని మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు మూసివేస్తారు.

● ఆ సమయంలో ఆలయ కౌంటర్లు, కార్యాలయాలు కూడా మూసి ఉంటాయి.

● సాయంత్రం 6 గంటల నుంచి స్వామి వారికి బోగము, హారతి, మంత్రపుష్ప నివేదన.

● రాత్రి 7 గంటల సమయంలో గూడెం ప్రధానాలయం మూసివేస్తారు.

శ్రీసత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలు ఇలా..

● శ్రీ సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాల మొదటి బ్యాచ్ ఉదయం 9 గంటలకు, రెండో బ్యాచ్ ఉదయం 11గంటలకు, మూడో బ్యాచ్ సాయంత్రం 3.30 గంటల నుంచి నిర్వహిస్తారు. వ్రతం ఆచరించే భక్తులు పూలు పండ్లు, కొబ్బరికాయలు, మంగళహరతిప్లేటు, మాణిక్యాలు, చెంబు, గ్లాస్‌ను వెంటతెచ్చుకోవాల్సి ఉంటుంది. మిగిలిన సామూహిక వ్రత పూజా సామగ్రి ఆలయంలోనే అందజేస్తారు.

Employee Voice

కారోబార్‌లను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలి

● నాగుల శ్రీధర్, కారోబార్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉద్యోగి వాయిస్



దండేపల్లి : ఏళ్ల తరబడి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. ప్రస్తుతం నెలకు కేవలం 2వేల వేతనమే చెల్లిస్తున్నారు. దీంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టమవుతున్నది. మా పరిస్థితి అధ్వానంగా మారింది. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాకుండా ఉన్నది. ఇప్పటికై నా ప్రభుత్వం స్పందించి, కనీస వేతనాన్ని నెలకు రూ.12వేలకు పెంచాలి. సర్పంచు మారినా కారోబార్లను మార్చకుండా ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. కారోబార్లలందరినీ వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. మా న్యాయమైన డిమాండ్లను ఇప్పటికైనా పరిష్కరించాలి. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తాం.

మతిస్థిమితం లేని యువకుడి ఆత్మహత్య



అంజన్న మృతదేహం

భీమిని: కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీగాం గ్రామానికి చెందిన కారెం అంజన్న (18) అనే మతిస్థిమితం లేని యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్నెళ్ల కిందట మతిస్థిమితం కోల్పోయిన అంజన్న మంగళవారం రాత్రి ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగాడు. బుధవారం తెల్లారేసరికల్లా అపస్మరక స్థితిలో పడి ఉన్న అంజన్ననను గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో తుది శ్వాస విడచాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

భర్త ఇంటి ఎదుట ఆందోళన

రామకృష్ణాపూర్: పట్టణంలోని అబ్రహంనగర్‌కు చెందిన నిమ్మల మౌనిక బుధవారం భర్త నరేష్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. నిమ్మల నరేష్ మూడేళ్ల క్రితం మౌనికను వివాహం చేసుకొని హైదరాబాద్‌లో నివాసం ఉంటుండగా కొన్ని నెలలుగా బార్యను వదిలేసి వచ్చి ఇంటి వద్ద ఉంటున్నారు. భర్త కోసం ఎదురు చూసిన మౌనిక ఎంతకు రాకపోవడంతో భర్త తల్లిదండ్రులు ఎల్లమ్మ, నర్సయ్యల వద్ద ఉంటున్నాడనే విషయం తెలుసు కొని ఆందోళన చేపట్టింది. దీంతో నరేష్ తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం అందించడంతో మౌనికను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై స్థానిక ఎస్సై ప్రేం కుమార్ మాట్లాడుతూ బాధితురాలి నుంచి ఫిర్యాదు రాలేదని ఎస్సై తెలిపారు.

పుణ్యస్నానానికి వచ్చి యువకుడి గల్లంతు

● చెన్నూర్ వద్ద గోదావరిలో మునక

చెన్నూర్: చెన్నూర్ వద్ద గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చి ప్రమాదశత్తూ గోదావరి నదిలో యువకుడు గల్లంతైన ఘటన ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం భీమారం మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆలం లక్ష్మణ్ శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని తన కుటుంబ సభ్యులతో కలిసి చెన్నూర్ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చాడు.

కుటుంబ సభ్యులతో కలిసి స్నానమాచరిస్తుండగా కుమారుడు తిరుపతి(20) లోతైన ప్రాంతానికి వెళ్లి గోదావరి నదిలో మునిగినట్లు తెలిపారు. కుమారుడు నదిలో గల్లంతైన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో చెన్నూర్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం నుంచి గజ ఈతగాళ్లతో గాలించినప్పటికీ గల్లంతైన తిరుపతి ఆచూకీ లభ్యం కాలేదు. అతను మంచిర్యాలలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు.

సంఘటనా ప్రాంతం వద్ద కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.



సంఘటన స్థలంలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రెడ్డిపెల్లిలో విషాదచాయలు

భీమారం : గోదావరి నదిలో స్నానానికి వెళ్లి యువకుడు గల్లంతు కావడంతో రెడ్డిపెల్లిలో విషాధచాయలు అలుముకున్నాయి. భీమారం మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆలం తిరుపతి (20) పుణ్యస్నానానికి వెళ్లి గోదావరిలో గల్లంతయ్యాడు. కన్న కొడుకు కళ్లఎదుటే నది ప్రవాహంలో కొట్టుకుపోతుండటంతో అతని తల్లిదండ్రులు బోరున విలపించారు. నిన్నటి వరకు తమతో తిరిగిన స్నేహితుడు గల్లంతయ్యాడని స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు.

నలుగురు పోడు రైతులపై కేసులు, రిమాండుకు తరలింపు

కాగజ్‌నగర్: గత కొన్నేళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న రైతులపై గత నెల రోజుల నుంచి సిర్పూరు నియోజకవర్గంలో పలు చోట్ల అటవీ అధికారుల వేధింపులు అధికమవుతున్నాయి. ఒక వైపు కింది స్థాయి అధికారులు ఏకంగా పోడు సాగు చేసుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో ఏమీ చేయాలో పోడు రైతులకు రైతులు దిక్కు తోచటం లేదు. బుధవారం బెజ్జూరు మండలం సుల్గుపల్లిలో కూడా పోడు చేస్తున్నారని నలుగురి రైతులపై కూడా అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారు.

సిర్పూరు నియోజకవర్గంలోని సిర్పూరు(టి), బెజ్జూరు, కౌటాల, చింతలమానెపల్లి పోడు రైతులకు 2005లో రాష్ట్ర ప్రభుత్వం పట్టాలను ఇచ్చింది. తాజాగా హరితహారం పేరిట మొక్కలను నాటేందుకు ఎవరు కూడా పోడు సాగు చేయరాదని అటవీ శాఖ అధికారులు పోడు రైతులను వేధించటం ప్రారంభించారు. ఈ విషయంలో పోడు రైతులకు కోసం పోరు చేపట్టిన సిర్పూరు నియోజకవర్గ నాయకుడు రావి శ్రీనివాస్‌ను కూడా కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారు. పది నెలల క్రితం సాక్షత్తు అటవీ శాఖ మంత్రి జోగు రామన్న ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు స్వయంగా పోడు రైతుల జోలికి పోమని, ఈ విషయంలో పూర్తి భరోసా ఇస్తామని ప్రకటించారు. అయినా కూడా అటవీ శాఖ అధికారులు ఏ మాత్రం పోడు రైతులను వదులటం లేదు. మంత్రి హామీ ఇచ్చిన కూడా పోడు రైతులపై కేసులు నమోదు చేయటంపై ప్రతిపక్ష నాయకులు, గిరిజన సంఘాల నాయకులు మండి పడుతున్నారు. కాగజ్‌నగర్ మండలంలో రెండు నెలల కిందట గిరిజన రైతులను పోడు చేస్తున్న వారిపై కూడా దాడికి పాల్పడ్డారు. వీరితో పాటు సిర్పూరు, కౌటాల, బెజ్జూరు మండలాల్లోని పోడు రైతులను కూడా నిత్యం వేధిస్తున్నట్టు స్వయంగా రైతులే బాహాటంగా ఆరోపిస్తున్నారు. కాగా అటవీ శాఖలోనే కింది స్థాయి అధికారులు కొంత మంది వేధింపులకు పాల్పడటం, పై స్థాయి అధికారులు ఏకంగా కేసులు నమోదు చేయటంతో రైతుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారయింది.



వివరాలు వెల్లడిస్తున్న పోడు రైతులు

● దారుణంగా కొట్టారు..

- పోడు రైతులు, సుల్గుపల్లి

బెజ్జూరు మండలం సుల్గుపల్లిలో తాము పోడు భూమాలను సాగు చేసుకుంటున్నామని, ఈ విషయంలో తమపై అటవీ అధికారులు దారుణంగా కొట్టారని, దీంతో తాము నడువలేని పరిస్థితిలో వచ్చామని పోడు రైతులు భీంరావు, శివలయ్య, బక్కయ్య, పురుషోత్తం తమ గోడును కాగజ్‌నగర్‌లో వివరాలు వెల్లడించారు. తమకు కనీసం ఎలాంటి సమాచారం లేకుండానే పట్టుకొచ్చారని, కట్టుబట్టలతోనే కార్యాలయం తీసుక రావటం, ఇప్పుడు మాత్రం మీ అందరిపై కేసులు పెట్టామని కోర్టుకు పోవాలని అటవీ అధికారులు పేర్కొనటం తమకు భయం వేస్తోందని రైతులు పేర్కొన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామని పేర్కొన్నారు.

ఏఆర్‌ఎస్‌ఐలకు ఆర్‌ఎస్‌ఐలుగా పదోన్నతి



ఆర్‌ఎస్‌ఐలుగా పదోన్నతులు పొందిన వారితో కమాండెంట్ జీవీఎస్ మూర్తి

మంచిర్యాల రూరల్ : హాజీపూర్ మండలంలోని గుడిపేటలో గల 13వ తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్(టీఎస్ఎస్‌పీ) బెటాలియన్‌లో పని చేస్తున్న 41 మంది ఏఆర్‌ఎస్‌ఐలకు ఆర్‌ఎస్సైలుగా పదోన్నతి లభించింది. బుధవారం పదోన్నతి పొందిన పోలీసులను కమాండెంట్ జీవీఎస్ మూర్తి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడారు. పదోన్నతితో బాద్యతలు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. క్రమశిక్షణతో పని చేసి ఉన్నత స్థానాన్ని పొందాలని కోరారు. సమాజంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా ఉంటూ పోలీస్ యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఎండీ తాజోద్దీన్, ఆర్‌ఐ సతీష్‌కుమార్, లెనిన్‌బాబు, ఆర్‌పీ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం కేసు నమోదు

బెజ్జూరు : మండలంలోని కుకుడ గ్రామానికి చెందిన సెడ్మెక ప్రేమల అనే యువతీ అదృశ్యమైనట్లు తండ్రి భీమయ్య ఫిర్యాదు చేశారు. ఈ నెల 2న సిర్పూర్‌కు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాక పోవడంతో బుధవారం బెజ్జూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
4
కాగజ్‌నగర్
కుమరం భీం | గురువారం 17 ఆగస్టు 2017
| కాగజ్‌నగర్ | సిర్పూర్(టి) | కౌటాల | బెజ్జూరు | దహెగాం | చింతలమానెపల్లి | పెంచికలపేట

అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి

● అన్ని పాఠశాలల్లో ప్రహరీల నిర్మాణం ● బెజ్జూరు మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూరు : అందరి భాగస్వామ్యంతోనే మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేద్దామని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సిరిపురం మంజుల అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో ఎంపీజీఎస్‌వై కింద 92 బీటీ రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. నియోజక వర్గం మొత్తం 93 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లు మంజూరయ్యాయని, పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. బెజ్జూరు- సోమిని గ్రామాల మధ్య పీఎంజీఎస్‌వై కింద రెండు వంతెనలు మంజూరైనట్లు పేర్కొన్నారు. కాటెపల్లి-అంబగట్ట, బెజ్జూరు- కమ్మర్‌గాం, పెంచికలపేట- ఆగర్‌గూడ, ఆగర్‌గూడ- కమ్మర్‌గాంతో పాటు తదితర గ్రామాలకు రాబోయే ఏడాదిలోగా రోడ్లు పూర్తి రవాణా పరంగా అభివృద్ధి చెందుతాయన్నారు. కంకర లేక కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంగా మూలంగా నత్తనడకన నడుస్తున్నాయన్నారు. ఇప్పటికే మండలంలోని రూ.4 కోట్లతో ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు.

నియోజక వర్గంలోని అన్ని పాఠశాలల్లో ప్రహరీ నిర్మాణానికి విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరితో మాట్లాడామని నెల రోజుల్లోగా నిధు లు మంజూరు కాగానే అట్టి పనులు ప్రారంభిస్తామన్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో మండల సమావేశానికి వ్యవసాయాధికారులు హాజరు కాక పోతే ఎలా అంటూ అధికారుల తీరుపై మండి పడ్డారు. తె లంగాణ ప్రభుత్వం హరితహారం పథకాన్ని పకడ్బందీగా ఏర్పాటు చేసిందని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని సూచించారు. అడవులను నరికి వేయడకుండా అధికారుల భాగస్వామ్యంతో అడవులను రక్షించుకుందామన్నారు. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న రైతులకు ఎలాంటి హాని తలపెట్టబోమని కొత్తగా అడవులను నరకవద్దని ఎమ్మెల్యే సూచించారు. మండలంలో కొన్ని పాఠశాలల్లో విద్యాధికారుల నిర్లక్ష్యంగా విద్యావలంటీర్ల నియామకం జరగలేదని ఖాళీగా ఉన్న పాఠశాలల్లో వీవీల నియమకానికి చర్యలు తీసుకుంటామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలు పూర్తి చేయడం లేదని కర్జెల్లి సర్పంచ్ డోకె రాజన్న అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొండపల్లి, బెజ్జూరు గ్రామ పంచాయతీలతో పాటు పలు గ్రామా ల్లో ఉపాధిహామీ కూలీలకు డబ్బుల చెల్లింపులు జరగడం లేదని సర్పంచ్‌లు సుధాకర్, సుగుణలు అధికారుల దృష్టికి తీసుకు రాగా రెండు రోజుల్లోగా కూలీ డబ్బులు చెల్లించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతో పాటు కోడిగుడ్లు సక్రమంగా అందడం లేదని కుళ్లి పోయిన కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారని సర్పంచ్‌లు లక్ష్మి, విశ్వేశ్వర్‌లు అధికారులకు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి ప్రతి నెల అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలని అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్పంచ్‌లు పర్యవేక్షణ చేయాలని సూచించారు.

గూడెం గ్రామంలో వృద్ధుల కు పెన్షన్ రావడం లేదని ఎంపీటీసీ నారాయణ అధికారుల దృష్టికి తీసుకు రాగా అర్హులైన వారికి పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తోటాజి పేర్కొన్నారు. సోమిని, మొగవెల్లి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కిందికి వేలాడుతున్నాయని సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచ్‌లు సుక్కబాయి, లక్ష్మిలు అధికారుల దృష్టికి తీసుకు రాగా వారం రోజుల్లోగా సమస్యలను తీర్చాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశించా రు. సమావేశంలో జడ్పీటీసీ కొండ్ర శారద, తహసీల్దార్‌లు రఘునాథ్, రియాజ్ అలీ, పంచాయతీరాజ్ ఏఈ సారంగపాణి, పశువైద్యాధికారి డాక్టర్ ధన్‌రాజ్, ఏ పీవో షాకీర్ ఉస్మాన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఎంఈవో రమేష్‌బాబు, సెక్టర్ అధికారి వేణుగోపాల్, ఎల్ఐ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

● అధికారులకు సన్మానం..

బెజ్జూరు మండలంలో చేసిన సేవలకు గాను ఇటీవల ఉత్తమ అధికారులుగా ఎంపికైన తహసీల్దార్ రఘునాథ్, ఏపీవో షాకీర్ ఉస్మాన్‌లను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఎంపీపీ సిరిపురం మంజుల, జడ్పీటీసీ కొండ శారదలతో పాటు అధికారులు శాలువాలతో సత్కరించి సన్మానించారు. అధికారులు కష్ట పడి పని చేస్తూ ప్రజల మన్నలు పొందాలని ఎమ్మెల్యే సూచించారు. అప్పుడే ప్రజల్లో చిరస్థాయిగా నిలిచి పోతారన్నారు. అనంతరం ఉపాధిహామీ కూలీలకు జాబ్ కార్డులను అందజేశారు.

విద్యార్థులకు వరం కస్తూర్బా పాఠశాల

● ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూరు : విద్యార్థులకు కస్తూర్బా పాఠశాలలు వరం లాంటివని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం పెంచికలపేట మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పెంచికలపేట మండల కేంద్రంగా ఏర్పాటు చేయడంతో ఇక్కడ కస్తూ ర్బా పాఠశాలను మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంత పేద విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా అనుకూలంగా ఉంటుందన్నారు. కొత్త పాఠశాలలో సదుపాయాల పరంగా కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ దశల వారిగా అన్ని పరిష్కారిస్తామన్నారు. ఏసీడీఎఫ్ పథకం కింద కొత్త చేతి పంపును మంజూరు చేస్తామన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సిరిపురం మంజుల, సర్పంచ్ సుగుణ, ఎంపీటీసీ సాజిత్, సత్యనారాయణ, తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంఈవో రమేష్‌బాబు, ఎస్ఓ కవిత, నాయకులు హర్షద్, సదాశివ్, చౌదరి తిరుపతి, నగనూరి శ్రీనివాస్, దూగుంట రాజం, బిట్ల శ్రీనివాస్, భక్తు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

● చింతగూడ అభివృద్ధికి కృషి..

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని చింతగూడ కోయవాగు గ్రామ


గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పంచాయతీలను అన్ని విధాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం చింతగూడలోని నూతన పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. చింతగూడ కోయవాగు లోలెవల్ వంతెనపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో పాటు రైల్వే ట్రాక్‌పై అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం కూడా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఎం.లక్ష్మణ్, చింతగూడ సర్పంచ్ ఆత్రం సంజీవ్, ఎంపీటీసీలు నికూరే నాగేందర్, గజ్జి వాసుదేవ్, ఎంపీడీఓ కుటుంబరావు, పంచాయతీ సెక్రెటరీ సంధ్య, మండల కో ఆప్షన్ సభ్యుడు సిద్దికి, నాయకులు కట్టా ప్రసాద్, బాబాఖాన్, లెండుగురె బాబురావు, సెండె చంద్రయ్య, చిన్నన్న, రాజన్న, ఎల్.శంకర్, మాజీ ఎంపీటీసీలు నూనె సంపత్, పిర్సింగుల పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

సిర్పూర్(టి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ ఆడె ప్రకాష్ అన్నారు. బుధవారం మండలంలోని మారుమూల ప్రాంతమైన భూపాలపట్నం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సమయానుసారంగా ఉపాధ్యాయులు హాజరవుతున్నారా లేదా అని, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరుశాతం తదితరాలను పరిశీలించారు. గురువారం నుంచి మీజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్‌ను ప్రతి ఒక్కరికి వేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

' నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలి'

కాగజ్‌నగర్ రూరల్: ఉపాధిహామీ ద్వారా చేపడుతున్న పనులను నిర్దేశిత లక్ష్యంలోగా పూర్తి చేయాలని కాగజ్‌నగర్ రెవిన్యూ డివిజన్ ఏపీడీ బావనరుషి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కాగజ్‌నగర్, దహెగాం, సిర్పూరు(టి) మండలాల ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ ద్వారా మరుగుదొడ్ల సర్వే సెప్టెంబరు 15లోగా పూర్తి చేసి నివేదికలను ఆయా మండలాల కార్యాలయాల్లో సమర్పించాలని సూచించా రు.

అదే విధంగా ప్రతి గ్రామపంచాయతీలో ఫారం పండ్ లక్ష్యాన్ని ఐదు రోజుల్లో పూర్తి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో గల వంట గదు ల నిర్మాణాలు, మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించా రు. ముఖ్యంగా ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న హరిత హారం కార్యక్రమంలో మొక్కలను సంరక్షించుకునే విధంగా పాటుపడాలన్నారు. ఉపాధిహామీ ద్వారా మంజూరవుతున్న పథకాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసి లోటు పాట్లు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ జిల్లా విజిలెన్స్ అధికారి రేగెళ్ల కృష్ణమూర్తి, కాగజ్‌నగర్, సిర్పూరు(టి) ఎంపీడీఓలు కుటుంబరావు, సయ్యద్ ఖాద్రి, ఎపీఓ బుచ్చన్న, దహెగాం ఏపీఓ చంద్రయ్యతో పాటు టెక్నికల్ అసిస్టెంట్లు, వీసీలు తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కౌటాల : మండలంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ప్రధాన వీధుల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని కుమరం భీం చౌరస్తాతో పాటు మార్కెట్ ఏరియాలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమాన్ని కౌటాల సీఐ అచ్చేశ్వర్‌రావు, జడ్పీటీసీ డబ్బుల నానయ్య, ఎస్సై అశోక్, ఐటీడీఏ పాల వర్గం సభ్యుడు మాంతయ్య, నాయకులు బండా రాజేందర్‌గౌడ్, విశ్వనాథ్, మాంతయ్యలు ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు జలేందర్, లవన్, స్వామి, సత్యనారాయణగౌడ్, ఫణిందర్‌గౌడ్, ప్రభాకర్‌లతో పాటు బాపు, తిరుపతి, కేసీఆర్ సేవాదళం మండలాధ్యక్షుడు విజయ్, గట్టయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కౌటాలలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐ అచ్చేశ్వర్‌రావు

వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో


వివాదస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రమేష్‌బాబు

కౌటాల : మండలంలోని ముత్తంపేట గ్రామానికి చెందిన వివాదస్పద స్థలాన్ని బుధవారం కాగజ్‌నగర్ ఆర్డీవో రమేష్ బాబు పరిశీలించారు. కొన్ని సంవత్సరాలుగా శ్మశాన వాటిక స్థలం వివాదస్పదంగా మారడం, గ్రామస్థులు ఆందోళనకు దిగడంతో ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ యాకయ్యలు బుధవారం స్థలాన్ని పరిశీలించి అందులో నుంచి ఎకరంన్నర స్థలంను శ్మశాన వాటికకు కేటాయించారు. స్థలంలో ఉన్న కంచెను తొలగింపజేశారు. అంతే కాకుండా నాళా కన్వర్షన్ స్థలాలను కూడా పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

చింతలమానెపల్లి : మండలంలోని రుద్రాపూర్ గ్రామంలో బుధవారం ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ జిల్లా నాయకుడు గంగారాం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వందన పంచాక్షరి, జిల్లా నాయకులు రాజేష్, మాజీ సర్పంచ్ మామిడి పోచక్క, సత్తన్న, రమేష్, కోటేశ్వర్‌గౌడ్, పొన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవులకు రక్షణ

చింతలమానెపల్లి : మొక్కలతోనే మానవులకు రక్షణ లభిస్తుందని పశువైద్యాధికారి డాక్టర్ ధన్‌రాజ్ పేర్కొన్నారు. మండలంలోని బాబాసాగర్ అంబేద్కర్ కమ్యూనిటీ భవనం ఎదుట బుధవారం యువకులతో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జాడి దిలీప్‌కుమార్, విజయ్, సురేష్, పులిన్, అదిత్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కామా భజన కార్యక్రమం

చింతలమానెపల్లి : మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా ఎక్కామా భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మూడు రోజులు భజన కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజన్న, సురేష్, వెంకయ్య చారి, పురుషోత్తం, తోగయ్య, తిరుపతి పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డుపై గుంత

- వాహనదారుల ఆందోళన
- పట్టించుకోని అధికారులు



మూల మలుపు వద్ద ఏర్పడ్డ గుంత

కెరమెరి : మండలంలోని అంతాపూర్ పంచాయతీ పరిధిలోని లెం డిగూడ గ్రామానికి వెళ్లే ఘాట్ రోడ్డు మూల మలుపు వద్ద కోతకు గురై పెద్ద గుంత ఏర్ప డింది. గుంతను పూడ్చాల్సిన అధికారులు, నాయకులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ రోడ్డు మీదుగా ఇటు మండల కేంద్రమైన కెరమెరికి, అటు మహారాష్ట్రలోని జివితి, గడ్‌చాందూర్ తదితర ప్రాంతా లకు ప్రతినిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలలో, జీపు లలో ప్రజలు రాక పోకలు కొనసాగిస్తుంటారు. కాగా ఘాట్ రోడ్డుపై మూల మలుపు మీద గుంత ఏర్పడ డంతో అదమరిచినట్లయితే లోయలో పడిపోయే ప్ర మాదం ఉందని వాహనదారులు వాపోతున్నారు. ప్రతి ఆదివారం కెరమెరి మండల కేంద్రంలో నిర్వహించే వారసంతకు సైతం పలు గ్రామాల ప్రజలు ఈ రోడ్డు మీదుగానే నిత్యావసర సరుకులు కొనుగోలు చేయడా నికి వస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గుంత...

- సూర్యవంశీ పరమేశ్వర్, సర్పంచు



లెండిగూడ గ్రామ సమీపంలో ఘాట్ రోడ్డు మూల మలుపు వద్ద పెద్ద గుంత ఏర్పడి ప్రమాదక రంగా మారింది. ఈ విషయమై పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకు పో యినా పట్టించు కోవడం లేదు. ఏ దైనా ప్రమా దం జరిగినట్ల యితే అధికా రులే బాధ్యత వహించాలి.

ఇంటింటి సర్వే ప్రారంభం

రెబ్బెన : మండలంలోని జక్కులపల్లి గ్రామంలో బుధవారం భూమి రికార్డులకు సంబంధించిన ఇంటింటి సర్వేను తహసీల్దార్ రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం రెవె న్యూ రికార్డులను క్రమబద్ధీకరించి భూము వివరాలను సక్రమం గా నమోదు చేయాలని ఆదేశించిన నేపథ్యంలో ఈ సర్వేను చేపడుతున్నామని తహసీల్దార్ రమేష్‌గౌడ్ తెలిపారు. ఈ సంద ర్భంగా ఇంటికి వస్తున్న రెవెన్యూ అధికారులకు రైతులు సహకరించి పూర్తి వివరాలను అందజేయాలన్నారు. ఆయన వెంట వీఆర్వో ఉంలాల్ ఉన్నారు.

● వాంకిడిలో...

వాంకిడి: ఇంటింటా పట్టాదారు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ మల్లి కార్జున్ సూచించారు. బుధవారం మండ లంలోని సవ్వాతిలో నిర్వహించిన ఇంటిం టా పట్టాదారు సర్వే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది బృందం చేస్తున్న సర్వేను పరిశీ లించారు. ప్రతీ పట్టాదారుడిని కలిసి భూముల వివరాలు సేకరించాలని సూచించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం పట్టేదారుని నుంచి అవసరం ఉన్న ధ్రువపత్రాలను పరిశీలించాలని తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే



మొక్కకు నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన : మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి పర్చాలనే ఉద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం కొండపల్లిలో ఏర్పాటు చేసిన హరితహారంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నారని చెప్పారు. ఇప్పటికే రెండు విడతలలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో మొక్కలు నాటి దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. మూడో విడత హరిత హారం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు హరితహారం కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి తెలంగాణ ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఎన్నో పథకాలను చేపడుతు న్నారని చెప్పారు. ముఖ్యంగా దళితులకు మూడు ఎకరాల సాగు భూమి, యాదవులకు 75శాతం సబ్సిడీతో గొర్రెలు, మత్స్యకారులకు చేప పిల్లలను, పేదింటి ఆడ పిల్లల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు రూ.75 వేల ఆర్థిక సహాయం అందజేస్తోందని తెలిపారు. దశాబ్దాల తరబడి కాంగ్రెస్ పాలనలో జరగని అభివృద్ధి మూడు సంవత్సరాల టీఆర్ఎస్ పాలనలో సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా కొండపల్లి, నేర్పల్లి గ్రామాలకు రోడ్డు సౌకర్యం సరిగ్గా లేదని గ్రామస్థులు, పాఠశాలలో క్రీడా స్థలం కోసం విద్యార్థులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. సమస్య పరిష్కారానికి సైతం తన వంతు కృషిచేస్తామన్నారు. అనంతరం గ్రామంలోని రోడ్లకు ఇరువైపులా, పాఠశాల ఆవరణలో పలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.సంజీవ్‌కుమార్, జడ్పీటీసీ ఎ.బాబురావు, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కె.శంకరమ్మ సర్పంచులు మాంతుమేర, కె.సులోచన, మాజీ సర్పంచు సంజీవ్‌గౌడ్, లక్ష్మణ్, ఉప సర్పంచు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత అంబులెన్స్ ఏర్పాటుపై హర్షం

సిర్పూర్(యూ): మండల ప్రజలకు పవర్ ఫౌండేషన్ సంస్థ ద్వారా ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేయడం హర్షణీయమని సర్పంచు ఆత్రం ఓం ప్రకాష్, అర్క నాగోరా వు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ సిర్పూర్(యూ) ఎస్సై రామారావు చొరవతో ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, చెప్పారు. అంబులెన్స్ గిరిజనులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యేటేటా ఆదివాసీలు జ్వరాల బారిన పడి ఆసుపత్రికి వెళ్లలేక సతమతమవుతున్నారన్నారు. కాగా ఎస్సై చొరవతో ఏర్పాటు చేసిన అంబులెన్స్ మం డల వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

'మీజిల్స్, రుబెల్లాను విజయవంతం చేయాలి'

సిర్పూర్(యూ): మండలంలోని నేటి నుంచి ప్రారంభించే మీజిల్స్ రుబెల్లా టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచు అర్క నాగోరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం నుంచి 9 నెలల నుంచి 15 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆయా కేంద్రాలలో మీజిల్స్ రుబెల్లా టీకాలు ఇవ్వనున్నారని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నీలకంఠ, ఏఎన్ఎంలు కవిత, హన్స పాల్గొన్నారు.

జైనూర్‌లో అవగాహన ర్యాలీ

జైనూర్: మండల కేంద్రంలో స్థానిక వైద్యసిబ్బంది, ఆశావర్కర్లతో మీజిల్స్, రూబెల్లా వ్యాక్సినేషన్‌పై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక 30పడకల ఆసుపత్రి నుంచి ప్రధాన వీధుల గుండా ఐకేపీ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్‌పీహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ గురువారం నుంచి సెప్టెంబర్ 25వరకు పిల్లలకు టీకాలు వేయనున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నరేష్, అరుణ, సాగర్, హెల్త్ సూపర్ వైజర్లు రమేష్, కిశోర్, లక్ష్మికుమారి, సాంబలక్ష్మి, పీహెచ్ఎన్ ఆర్తి ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వ సభ్య సమావేశం వాయిదా

వాంకిడి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించాల్సిన మండల సర్వ సభ్య సమావేశానికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ అర్జున్ పవార్ తెలిపారు. అధికారులు పూర్తి స్థాయిలో హాజరు కాక పోవడంతోనే వాయిదా వేశామని తెలిపారు. సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

'గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి'

ఆసిఫాబాద్: గ్రామ గ్రామాన పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు కాండ్రె విశాల్ పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పార్టీ దృష్టికి తీసుకు వచ్చి పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు శంకర్, నిర్మల, గణపతి, రాజన్న, గోపాల్, మొండన్న తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీల వర్గీకరణ సరికాదు'



మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

కెరమెరి : ఎస్సీల వర్గీకరణ చేపట్టడం సరికాదని అంబేద్కర్ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు కుమరం భీం జిల్లా అంబేద్కర్ సంఘం నాయకులు బుధవారం మండల కేంద్రంలోని ఆసిఫాబాద్-ఆదిలాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్గీకరణకు ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకోబోమని చెప్పారు. వర్గీకరణ చేపట్టినట్లయితే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు హెచ్చరించారు. సమాచారం అందుకున్న ఎస్సై సత్యనారాయణ అక్కడికి చేరుకుని ఆందోళన కారులను నచ్చ చెప్పి రాస్తారోకో విరమింపజేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, ఆత్మారాం, శ్యాంరావు, వసంత్‌జాదే పాల్గొన్నారు.

'మండల పరిషత్ సమావేశాలపై అధికారుల నిర్లక్ష్యం'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ శ్రీనివాస్

రెబ్బెన: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహణలో నిర్లక్ష్యం సరికాదని నంబాల ఎంపీటీసీ కొవ్వూరి శ్రీనివాస్, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు, సర్పంచు రవీందర్ అన్నారు. బుధవారం మండల సమావేశం రద్దు కావడంతో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి మూడు నెలలకోసారి సమావేశాన్ని మం డల పరిషత్ అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. కాగా సంబంధిత ప్రజాప్రతినిధుల, అధికారుల నిర్లక్ష్యం మూలంగా మండలంలో ఈ సమావేశాలు సక్రమంగా కొనసాగడం లేదన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశానికి 3 గంటలకు సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు రావడంలో అర్థం లేదన్నారు. ఇప్పటికైనా గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారానికి సరైన తేదీలలో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అధికారులు, ప్రజాప్రతినిధులు సమయానికి హాజరు కావాలని సూచించారు. వారి వెంట సింగిల్ విండో చైర్మన్ గాజుల రవి, వైస్ చైర్మన్ వెంకటేష్ ఉన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

రెబ్బెన : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన మండల పరిషత్ సమావేశాన్ని సభ్యుల కోరిక మేరకు వాయిదా వేశామని ఎంపీపీ కె.సంజీవ్‌కుమార్ ప్రకటించారు. సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ మండల పరిషత్ అధ్యక్షుడితో సహా జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు మూడు గంటలకు హాజరయ్యారు. దీంతో సమావేశం నిర్వహణ తీరుపై ఎంపీటీసీ శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశాలను సమయానుసారం నిర్వహించాలని, ఇప్పటి వరకు ఎందరో ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశం కోసం చూసి వెళ్లి పోయారని తెలిపారు. దీంతో ఈ సమావేశాన్ని మరో తేదీలో నిర్వహించాల్సింది గా కోరారు. ఈమేరకు మిగితా సభ్యులు సైతం ఆమోదం తెలపడంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ప్రకటించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

● కలెక్టర్ చంపాలాల్

కాగజ్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ చంపాలాల్ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక పెట్రోలు పంపులోని ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు సరిపడ తరగతి గదులు లేవని, దీంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని జిల్లా కలెక్టర్ చంపాలాల్‌కు, ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు పూర్తి స్తాయిలో సమస్యలను వివరించారు. అనంతరం పాఠశాలలోని వివిధ గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అన్నీ విధాల చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఎమ్మెల్యే కోనప్ప లిఖిత పూర్వకంగా సమస్యలతో కూడి వినతి పత్రాలను అందజేశారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి: సీఐ



క్రీడాకారులకు బహుమతిని ప్రదానం చేస్తున్న సీఐ

కౌటాల : ప్రతి ఒక్కరూ క్రీడాకారులను ప్రోత్సహించాలని కౌటాల సీఐ అచ్చేశ్వర్‌రావు అన్నారు. కౌటాల మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలతో మానసిక అభివృద్ధి కలుగుతుందని, క్రీడలు నిర్వహిస్తే మట్టిలో మాణిక్యాలు బయటకు వస్తారని, క్రీడల వల్ల యువకులు చెడు మార్గం పట్టకుండా సన్మార్గంలో నడుస్తారని పేర్కొన్నారు. క్రీడాకారులకు ఎలాంటి అవసరం ఉన్నా, క్రీడా సామగ్రి అవసరమున్నా తమను సంప్రదించాలన్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో క్రీడా కిట్లు పంపిణీ చేశామన్నారు. ఈ క్రీడల్లో 20 జట్లు పాల్గొనగా కుంటమానెపల్లి జట్టుకు మొదటి, బాబాసాగర్ జట్టుకు ద్వితీయ బహుమతి లభించింది. గెలుపొందిన జట్టుకు రూ.2 వేలు, ద్వితీయ స్థానం జట్టుకు వెయ్యి రూపాయల నగదు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్, ఏఎస్సై హనుమండ్లు, ఎంఎల్ రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



ఉత్తమ అంగన్‌వాడీ వినోదను సన్మానిస్తున్న కౌన్సిలర్ సుజాత

కౌటాల : ఉత్తమ సేవలు అందించి స్వాతంత్ర్య దినోత్సవంలో ప్రశంసా పొందిన అధికారులను కౌటాల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా కౌటాల సీఐ అచ్చేశ్వర్‌రావు, ఎస్సై అశోక్, ఏఎస్సై హనుమండ్లు, కానిస్టేబుల్ చరణ్‌సింగ్‌లు జిల్లా కలెక్టర్ చంపాలాల్ చేతుల మీదుగా అవార్డులు అందుకోగా కౌటాల పోలీసుస్టేషన్‌లో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అమూల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు శ్రీధర్, నరేష్, రాజేష్, నాగభూషణ్, రాజేశం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ టౌన్: ఏ వృత్తిలోనైనా అంకిత భావంతో సేవలు అందిస్తేనే అనతి కాలంలో గుర్తింపు వస్తోందని 21వ వార్డు కౌన్సిలర్ పంబాల సుజాత అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంకిత భావం, సేవా దృక్పథం ఉంటే అన్నీ రంగాల్లో చక్కగా రాణించవచ్చున్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో చక్కగా పని తీరును ప్రదర్శించి జిల్లాలోనే ఉత్తమ అంగన్వాడీగా ఎంపికైన మాచర్ల వినోదను అందరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాచర్ల వినోదను ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు సునిత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధులకు టీకాతో చెక్

● జిల్లాలో 1.70 లక్షల మంది చిన్నారులు ● నేటి నుంచి మీజిల్స్ రుబెల్లా వ్యాక్సినేషన్ పంపిణీ

కాగజ్‌నగర్ రూరల్: దేశంలో ఏటా మీజిల్స్ (తట్టు), రుబెల్లా వైరస్ సోకి దాదాపు 49,200 మంది చిన్నారులు కన్ను మూస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు చెబుతున్నాయి. తొమ్మిది నెలల చిన్నారుల నుంచి 15 ఏళ్ల బాలలకు సోకే మీజిల్స్ (తట్టు), రుబెల్లా వైరస్ను సమర్థంగా ఎదుర్కొవడానికి కేంద్ర ప్రభుత్వం టీకా (ఎంఆర్)ను ప్రవేశ పెట్టబోతుంది. ఇప్పటికే ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమంపై కళాజాతాతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కార్యకర్తలతో పాటు అంగన్‌వాడీ, ఆశా, విద్యాశాఖ, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేస్తూ అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుంచి సెప్టెంబర్ 23 వరకు అయిదు వారాల పాటు దశల వారిగా టీకాలను వేసేందుకు అధికార యంత్రాంగం ప్రణాళికలను రూపొందించింది. మొదటి, రెండు వారాల్లో పాఠశాలల్లో, మూడు, నాలుగు వారాల్లో అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని 9 నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలకు, అయిదో వారంలో డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి టీకాలు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. టీకాకు సంబంధించి కిట్లపై అధికారులు సిబ్బందికి వివిధ సబ్ సెంటర్లలో ప్రతి రోజు ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి రవాణా సౌకర్యం ఏర్పాటు చేసి అయిదు వారాల పాటు మీజిల్స్ రుబెల్లా(తట్టు) నివారణకు పూర్తి స్థాయి ఏర్పాట్లలో వైద్య ఆరోగ్య శాఖ తలమునుకలైంది.

లక్ష్యాన్ని అధిగమించేందుకు సంసిద్ధం..

- సుబ్బారాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికాధికారి,



జిల్లా వ్యాప్తం 1.70 లక్షల మంది 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు టీకాలు వేయడమే లక్ష్యంగా పూర్తి స్థాయి ప్రణాళికలను రూపొందించాం. దీంతో ఇప్పటికే వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, విద్యాశాఖ, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, ఆశా కార్యకర్తలు సమాయత్తం చేసి ఒక బృందంలో అయిదుగురు సభ్యులు ఉండేలా ఏర్పాట్లను చేశాం.

ఒక బృందం ఒక్క రోజు 200 మం ది పిల్లలకు వ్యాక్సిన్ ఇచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నాం. జిల్లాలో వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్ర ణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నాం.

మీజిల్స్ రుబెల్లా నివారణకు అవగాహన..

- విద్యావతి, వైద్యాధికారి, కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఆయా సబ్ సెంటర్లలో సిబ్బందితో పాటు అనుసంధాన శాఖకు అవగాహన కల్పించాం. వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు సూచించిన మేరకు సిబ్బందికి ఎప్పటికప్పుడు అవగాహన కలిపిస్తూ మీజీల్స్ రుబెల్లా(తట్టు) వ్యాక్సినేషన్ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సంసిద్ధంగా ఉన్నాం. గతంలో పల్స్ పోలియో చుక్కల మందును వంద శాతం పూర్తి స్థాయిలో సఫలీకృతం చేసిన మాదిరిగానే ఈ మీజిల్స్ రుబెల్లాను ముందస్తుగా నివారించేందుకు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేస్తున్నాం.

సిబ్బందిని సమాయత్తం చేశాం..

-గ్లోరి సృజన, ఇన్‌చార్జి హెచ్‌వీ, కాగజ్‌నగర్



మీజిల్స్ రుబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమం కాగజ్‌నగర్ పీహెచ్‌సీ పరిధిలో పూర్తిగా విజయవంతం అయ్యేలా ఇప్పటికే వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో పాటు ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలను పూర్తి సమాయత్తం చేశాం. అయిదు వారాల పాటు అన్ని గ్రామాల్లో నిర్ధేశించిన లక్ష్యాలను వంద శాతం సిబ్బంది, అనుసంధాన శాఖలతో కలిసి పూర్తి చేస్తాం. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కూడా మీజిల్స్ రుబెల్లా వ్యాధిని అరికట్టాలనే లక్ష్యంతో పట్టుదలతో ముందుకు సాగుతున్నారు.

పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు..

- లక్ష్మి, సెకండ్ ఏఎన్‌ఎం, కాగజ్‌నగర్



మీజిల్స్ రుబెల్లా(తట్టు) వ్యాక్సినేషన్‌పై అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ మేరకు గ్రామాల్లో 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లల తల్లిదండ్రులకు రుబెల్లాపై వివరించడంతో పాటు పిల్లలకు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ప్రతీ ఒక్కరు అయిదు వారాల పాటు అందుబాటులో ఉండేలా అవగాహన కల్పించడంతో పాటు పూర్తి స్థాయి సామగ్రిని వినియోగించే తీరుపై నైపుణ్యం పొందాం.

మీజిల్స్, రుబెల్లా కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలి

● కలెక్టర్ చంపాలాల్

ఆసిఫాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుంచి ప్రారంభమయ్యే మీజిల్స్ రుబెల్లా టీకా కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ చంపాలాల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్యాధికారులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 9 నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలను గుర్తించి మీజిల్స్ రుబెల్లా టీకాలను వేయించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు టీకా కార్యక్రమానికి సంబంధించి వివరాలను కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో 1,67,457 మంది పిల్లలను గుర్తించామన్నారు. 18 పీహెచ్‌సీల పరిధిలో 1,155 స్కూళ్లలో, 973 అండన్‌వాడీ కేంద్రాల్లో 172 మంది వైద్య సిబ్బందిని బృంధాలుగా ఏర్పాటు చేశామని తెలిపారు. వారికి వ్యాక్సినేషన్ పంపిణీ చేయడం జరిగిందని నాలుగు వారాల పాటు సిబ్బంది వ్యాక్సిన్ ఇస్తారన్నారు. ఐదో వారంలో మిగిలి పోయిన పిల్లలను గుర్తించి టీకాలు వేసామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సీతారాం, డీసీహెచ్‌ఓ విద్యాసాగర్, డీఈఓ రఫీక్, డీడబ్ల్యూఓ సావిత్రి, వైద్యాధికారులు పాల్గొన్నారు.



మీజిల్స్, రుబెల్లాపై కలెక్టర్‌కు వివరిస్తున్న డీఎంహెచ్‌ఓ సుబ్బారాయుడు, మాట్లాడుతున్న కలెక్టర్

కాగజ్‌నగర్ పీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్ ప్రారంభం..

కాగజ్‌నగర్ రూరల్: మారు మూల గ్రామాల గర్భిణులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే ఆపరేషన్లు నిర్వహించేలా ప్రభుత్వం ఆధునాతన సౌకర్యాలను మంజూరు చేస్తోందని జిల్లా కలెక్టర్ చంపాలాల్ అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆపరేషన్ థియేటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆపరేషన్లు చేయించుకోవాలంటే ఎంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాటికి తోడు వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేసే దిశలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే ఆపరేషన్లు చేసే విదంగా పరికరాలను, వసతులను కల్పిస్తోందని అన్నారు. ఒక్కో గర్భిణీకి ఆపరేషన్‌కు గాను సుమారు రూ.15 వేల నుంచి రూ.30 వేల ఖర్చు అవుతుందని వీటన్నింటిని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఉచితంగా ఆపరేషన్లు చేసేందుకు కృషి చేస్తోందన్నారు. అనంతరం కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్, కౌటాల, లోనవెల్లి, ఈసుగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎంతో మంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారని తద్వారా శిశు మరణాలను, పౌష్టికాహారం లోపం ఉన్నందున కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తహీనత(ఎనిమిక్)తో బాధపడుతున్న వారికి రాగి పిండి, బెల్లం, నువ్వులతో కూడిన ఆహారంను అందించేందుకు ముందుకు రావడం హర్షిందగ్గ విషయమన్నారు. ఎన్నో స్వచ్ఛంద సంస్థలు స్వతాహాగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన కోనేరు చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమన్నారు. శాసన సభ్యులై ప్రజలపై ఎంతో మక్కువతో ఈ సేవలందించడం అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన ఏఎన్‌ఎంలు ప్రతీ నెల చేసే పరీక్షల ఆధారంగా రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు ప్రతి నెల పౌష్టికాహారంతో కలిగిన కిట్లను అందజేస్తున్నట్లు ఆయన అన్నారు.

అనంతరం ఎమ్మెల్యే కోనప్ప మాట్లాడుతూ అతి మారుమూల తాలూకా అయిన ఈ ప్రాంతంలో పౌష్టికాహారం లోపం కారణంగా ఎంతో మంది గర్భిణులు ఇబ్బందులకు గురవుతున్నారని ఉమ్మడి రాష్ట్రంతో పాటు ఉమ్మడి జిల్లాలో కూడా రక్తహీనతతో మరణాలు చెందిన వారి సంఖ్య ఇక్కడ అధికంగా ఉందని వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని రక్తహీనతతో జరుగుతున్న మరణాలను అరికట్టేందుకు ఈ కార్యక్రమాన్ని ఎంచుకున్నామని సెప్టెంబర్ మొదటి వారం నుంచి ఈ కార్యక్రమం ప్రవేశ పెడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందుకు గాను ఆయా మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన ఏఎన్‌ఎంలు సహకరించి కృషి చేసి రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల మరణాలను అరికట్టేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ సుబ్బారాయుడు, జడ్పీటీసీ లక్ష్మణ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సునీల్‌రావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సీతారాం నాయక్, వైద్యాధికారులు విద్యావతి, ఉషారాణి, ఆర్ఐ రాంలాల్, పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 8

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. విద్యా సంస్థలతో పనులు పూర్తవుతాయి. ప్రియతముల నుంచి ఆహ్లాదకరమైన సమాచారం అందుకుంటారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లకు అనుకూలం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): ఆర్థిక విషయాల్లో మీ వైఖరిని సమీక్షించుకుంటారు. కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక పరమైన లక్ష్యాలు సాధిస్తారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం.

మిథునరాశి: (మే21-జూన్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు ఫలిస్తాయి. ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. రాజకీయ, సినీరంగాల వారికి ప్రోత్సాహకరం. శుభవార్త అందుకుంటారు. రవాణా, బోధన రంగాల వారికి అనుకూలం.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఉన్నత విద్యకు అవసరమైన నిధులు సమకూర్చుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. దూరప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులు లాభిస్తాయి.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. పెట్టుబడుల విషయాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): వృత్తి, వ్యాపారాలకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వాయిదా పడుతున్న పనులు పూర్తిచేస్తారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): మిత్రులు, బంధువులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలు పూర్తవుతాయి. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అవకాశం ఉంది. మెడికల్ క్లెయిములు పరిష్కారం అవుతాయి.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు సంభవం. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. నూతన భాగస్వాముల లాభిస్తాయి. జనసంబంధాలు విస్తరిస్తాయి. సంకల్పం నెరవేరుతుంది.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): వైద్య, పరిశ్రమలు, హోటల్, రిటైల్ రంగాల వారికి అనుకూల సమయం. విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): డిపాజిట్లపై మంచి ప్రతిఫలాలు అందుకుంటారు. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. బ్యాంకుల, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బదిలీలు, మార్పులకు అనుకూలం. హోటల్, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి పోత్సాహకరం. సేవల రంగాల వారు సత్ఫలితాలు సాధిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

కుల వృత్తులకు ముఖ్యమంత్రి చేయూత

● యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు



దండేపల్లిలో మాట్లాడుతున్న అరిగెల నాగేశ్వర్‌రావు

దండేపల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ కులవృత్తుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలంగాణ యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. బుధవారం దండేపల్లిలో యాదవసంఘం భవనంలో సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న గొల్ల కుర్మల ఆర్థిక పురోభివృద్ధికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించిందన్నారు. యాదవులంత ఐకత్యంగా ఉంటూ సంఘం బలోపేతానికి పాటుపడ్డాలన్నారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి గొర్రెల పంపిణీ చేస్తారన్నారు. యాదవుల్లో అధికశాతం ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. యాదవులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. మూడేళ్లలో సీఎం కేసీఆర్ రాష్ట్రఅభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం నుంచి 119 బీసీ గురుకులాలు ప్రారంభించి అందులో యాదవ పిల్లలకు కూడా అవకాశం కల్పించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 19 గురుకులాలు ఉంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో 119 ఏర్పాటు చేశారని ఈసందర్భంగా గుర్తు చేశారు. ప్రజాసంక్షేమం కోసం నిరంతరం కృషి చేసేది టీఆర్‌ఎస్ ప్రభుత్వమే అని అన్నారు. ఈకార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లాల సమ్మయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు జెల్ల శంకరయ్య, జిల్లా మహిళ యాదవ సంఘం అధ్యక్షురాలు పద్మక్క, జిల్లా నాయకులు తిరుమల, గడ్డం సతీష్, అంజయ్య, మండల అధ్యక్షులు తోట జయన్న, మండల నాయకులు చెన్నయ్య, నరేష్,బానుప్రసాద్, దర్మరాజు, కుమార్‌స్వామి, మల్లేష్, సత్యనారాయణ, రామన్న, గంగన్న,అశోక్, మహేష్, రాజన్న తదితరులు ఉన్నారు.

'పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి'



మాట్లాడుతున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి

నెన్నెల: పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఆర్టీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. కంట్రిబ్యూటరీ విధానాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. తహసీల్దార్ సత్యనారాయణకు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఇన్నారెడ్డి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004 సెప్టెంబరు1 నుంచి నియమితులైన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం లోపభూయిష్టంగా ఉందన్నారు. దీంతో రిటైర్డు అయిన వారికి అతి తక్కువ పెన్షన్ వస్తుందన్నారు. పాత పెన్షన్ విధానం అమలయ్యే వరకు తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతాయన్నారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలలో సంఘం ఎక్సిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బి. మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాస్, మండల విద్యాధికారి శ్రీధర్‌స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు కోడూరి శ్రీనివాస్, చంద్రమౌళి, బెల్లంపల్లి, మందమర్రి మండలాల అధ్యక్షులు చెన్న కేశవులు, అరవిందకుమార్, మండల బాధ్యులు ఎస్ సదయ్య, కార్యదర్శి పి. శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

నేతకాని ఇన్మర్ మహార్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గోమాస రాజం



బెల్లంపల్లి టౌన్: తెలంగాణ నేతకాని ఇన్మర్ మహార్ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా బెల్లంపల్లిలోని స్టేషన్ రోడ్డు కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు గోమాస రాజం ఎన్నికయ్యారు. బుధవారం బెల్లంపల్లిలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో గోమాస రాజంను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ తీర్మానించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి నర్సయ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలాలి నర్సయ్యలు తెలిపారు. ఈసందర్భంగా గోమాస రాజం మాట్లాడుతూ సంఘాన్ని జిల్లాలో బలోపేతం చేసేందుకు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఎంప్లాయిమెంట్ కార్డుల రెన్యూవల్‌కు అవకాశం

మంచిర్యాల టౌన్: మంచిర్యాల జిల్లా ఉపాధి కల్పన శాఖలో గతంలో ల్యాప్ అయిన కార్డుల రెన్యూవల్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు ఉపాధి కల్పన శాఖ అధికారి వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. 01-01-2000 నుంచి 31 జూలై 2017 మధ్య కాలంలో లాప్స్ అయిన కార్డులకు రెన్యూ వల్ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఇట్టి కార్డులను ఈ సంవత్సరం డిసెంబర్ 31 వరకు రెన్యూవల్ చేసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వంజరిగూడలో మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం

● కిడ్నీ బాధితులకు ప్రభుత్వం భరోసా

లింగాపూర్: కుమరంభీం జిల్లా లింగాపూర్ మండలంలోని వంజరిగూడలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వారి కోసం బుధవారం ప్రభుత్వం మంజూరు చేసిన వాటర్‌ప్లాంట్‌ను తహసీల్దార్ ఆర్.బాబుసింగ్, ఎస్పై తిరుపతిలు ప్రారంభించారు. గ్రామానికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఎమ్మెల్సీ పురాణం సతీష్, గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్‌రావు చొరవతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వంజరిగూడలో మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వంజరిగూడ గ్రామస్థులను ప్రభుత్వపరంగా మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వపరంగా వైద్య సదుపాయాలు అందిస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. గ్రామస్థులు వ్యక్తిగత పరిశుభ్రత, గ్రామ పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. 'ఆంధ్రజ్యోతి' ప్రతిక కిడ్నీ బాధితులను వెలుగులోకి తీసుకురావడంతో ప్రభుత్వం తక్షణం స్పందించిందన్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఎస్పై తిరుపతి మాట్లాడుతూ గ్రామస్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బాధితులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు కేంద్రె బాబు, గణపత్, గుణవంతరావు, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని మారుమూల ఆదిమ కోలాం గిరిజన గ్రామమైన గీతబండ గ్రామాన్ని తహసీల్దార్ బాబుసింగ్, ఎస్పై తిరుపతి బుధవారం సందర్శించారు. గ్రామంలోని పాఠశాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని సమస్యల గురించి ఈసందర్భంగా స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

'రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు'



కెరమెరిలో గిరిజనేతరులకు పహణీలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

కెరమెరి: రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి పేర్కొన్నారు. కెరమెరి మండల కేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే కోవలక్ష్మి మండలంలోని అంతాపూర్, పరందోళి, సుర్దాపూర్, కెరమెరి, కైరి, మోడి గ్రామపంచాయితీలకు చెందిన గిరిజనేతరులకు పహణీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎకరానికి నాలుగు వేల రూపాయలు, రెంటు పంటలు వేసే రైతులకు ఎకరానికి ఎనిమిది వేలు వచ్చే ఖరీఫ్ నుంచి నేరుగా రైతుల అకౌంట్లలో జమ చేయడం జరుగుతుందన్నారు. రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పహణీలు అందజేస్తున్నట్లు ఆమె గుర్తు చేశారు. అనంతరం బీసీ హస్టల్, గ్రామపంచాయితీల్లో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. మొక్కలను ప్రతి ఒక్కరు సంరక్షించాలన్నారు. వాతావరణ కాలుష్యం పెరిగి పోతున్న నేటి తరుణంలో ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత చేపట్టారు. బీసీ హాస్టల్‌కు రంగులు వేయడానికి రూ.50 వేలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే హాస్టల్‌కు బోరుబావిని మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరి గోడను నిర్మించాలని ఎమ్మెల్యే కోవలక్ష్మికి విద్యార్థులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ యాదవ్‌రావు, ఎంపీపీ గణేష్, జడ్పీటీసీ అబ్దుల్‌కలాం, సర్పంచ్ సుంగుబాయి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు రాథోడ్ శంకర్‌నాయక్, సర్పంచ్‌లు పెందూర్ జలపత్‌రావు, మడావి భీము, టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఉత్తంనాయక్ పాల్గొన్నారు.

'ఎస్ఎల్‌పీ పదోన్నతుల్లో ఆర్జీ-2 కార్మికులకు నష్టం'

యైటింక్లయిన్‌కాలనీ: ఎస్ఎల్‌పీ పదోన్నతుల కల్పనలో ఆర్జీ-2 డివిజన్ కార్మికులకు నష్టం వాటిల్లుతున్నట్టు ఏఐటీయూసీ నాయకులు ప్రకాష్, అన్నారావు, రాజారత్నం, శ్యాంసన్, వెంకట్రావ్, సత్యనారాయణలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇతర ఏరియాల్లో ఎస్ఎల్‌పీ పదోన్నతులు ఇస్తున్నా ఆర్జీ-2 అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. లేదన్నారు. ఈవిషయంలో గుర్తింపు సంఘం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు.

వేతనాల పెంపుపై కార్మికుల్లో ఉత్కంఠ

● నేటి నుంచి రాంచీలో పదో వేజ్‌బోర్డు సమావేశం ● గతం కంటే ఎక్కువగా పెంచాలని సంఘాల డిమాండ్

ఆంధ్రజ్యోతి, మంచిర్యాల: పదో వేజ్‌బోర్డులో ఎంత శాతం వేతనాలు పెరుగుతాయోనని కార్మికులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. రాంచీలో కోల్ ఇండియా సీఎండీ సుతీర్థ భట్టాచార్య అధ్యక్షతన గురు, శుక్రవారం జేబీసీసీఐ 10 (వేతన కమిటీ) సమావేశం జరగనుంది. పదో వేతన ఒప్పందం జూలై 1, 2016 నుంచి అమలు కావాల్సి ఉంది. పదో వేతన ఒప్పందం చర్చలు డిసెంబర్ 2016లో ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు జరిగిన చర్చలలో అసలు విషయమేమీ తేలలేదు.

రిటైర్డ్ కార్మికుల మెడికల్ స్కీం..

ఇక రిటైర్డ్ అయిన కార్మికులకు తొమ్మిదో వేతన ఒప్పందంలో చేసుకున్న మెడికల్ స్కీంలో సాధారణ జబ్బులకు రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు పెంచేందుకు అంగీకరించారు. గుండె, క్యాన్సర్, పక్షవాతం, మూత్రపిండాలు తదితర వ్యాధులతో పాటు సీరియస్ యాక్సిడెంట్, మోకాళ్ల చిప్పల మార్పిడిలను కూడా చేర్చి జబ్బులకు రూ.10 లక్షల సీలింగ్‌ను ఎత్తివేసి ఎంత ఖర్చయినా భరించే విధంగా జేబీసీసీఐ-10లో ఆమోదించారు. ఈ స్కీం రిటైర్డ్ అయిన కార్మికుడు, అతని భార్య వారిపై ఆధారపడ్డ వికలాంగులైన కుటుంబ సభ్యులకు వర్తిస్తుంది. సింగరేణిలో రెఫరల్ ఇబ్బందులను తొలగించడానికి హెల్త్‌కార్డులు ఇస్తారు. దుర్వినియోగం కాకుండా ఆధార్‌తో అనుసంధానం చేస్తారు. పై సవరణలు, ఒప్పందంలోని అంశాలు జూలై 2016 నుంచి అమలు చేస్తారు.

రూ.40 వేల కోట్ల నిధులతో పెన్షన్ ట్రస్ట్ నడుస్తుందని, దీనిని ఇలాగే కొనసాగిస్తే ఇప్పటి వరకు రిటైర్డ్ అయిన కార్మికులకు, భవిష్యత్తులో దిగిపోయే వారికి పెన్షన్ ఇవ్వడంలో 2020 తర్వాత సంక్షోభంలో పడిపోతుందని కోలిండియా పేర్కొంది. ఈ సంక్షోభం నుంచి బయట పడటానికి బొగ్గు అమ్మకంపై ప్రతీ టన్నుకు రూ.20లు యూనియన్లు కోరితే యాజమాన్యం రూ.15 ఇవ్వడానికి అంగీకరించింది. ఈ ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం తిరస్కరించిన నేపథ్యంలో ప్రతి కార్మికుడి జీతంపై 14 శాతం రికవరీ చేస్తే తప్ప పెన్షన్ కొనసాగే పరిస్థితి లేదు. దీంతో యాజమాన్యం పెట్టిన ప్రతిపాదన 7శాతం కార్మికుడు భరించాలనే ఒప్పందానికి యూనియన్లు వచ్చాయి. దీనిని జూలై 2016 నుంచి వర్తింపజేస్తున్నారు. దీని వల్ల కార్మికుడిపై అదనంగా 2.09 శాతం భారం పడనుంది. పెన్షన్‌ను కొనసాగించడానికి ఇంతకన్నా మార్గం మరొకటి లేదని మిగతా అంశాలు బోర్డ్ ఆఫ్ ట్రస్టీ (బీఓటీ)లో నిర్ణయిస్తారని యూనియన్లు పేర్కొన్నాయి.

కోలిండియాలో రిజర్వ్ ఫండ్ (ప్రతీ సంవత్సరం లాభాలలో నుంచి రిజర్వ్ చేసిన నిధి) రూ.55,000 కోట్లు ఉంది. కేంద్ర ప్రభుత్వం జేబీసీసీఐ చర్చల సందర్భంగా ఈ నిధిని తీసుకోవడం జరిగింది. దీంతో కోలిండియా ఆర్థిక సంక్షోభంలో పడింది. కేంద్రం అన్ని ప్రభుత్వ రంగ సంస్థల అధికారులకు పది సంవత్సరాల కాలపరిమితితో కేవలం 15శాతం మాత్రమే వేతనాలు పెంచుతామని సిఫార్సులను చేయడం జరిగింది. కార్మికుల పట్ల కూడా అదే విధానాన్ని అవలంబిస్తోంది. కోలిండియా యాజమాన్యం, జేబీసీసీఐ-10 (వేతన కమిటీ) చర్చల సందర్భంగా నాలుగు సార్లు రూ.3వేల ప్యాకేజీనే అంటే 7శాతం పెరుగుదల మాత్రమే ఉంటుందని చెబుతూ వచ్చింది. యూనియన్ల హెచ్చరిక మేరకు రూ.5 వేల ప్యాకేజిని అంటే 14 శాతం పెరుగుదలతో అలవెన్స్‌లు కలిపి 18.2 శాతం పెరుగుదలను ముందుకు తెచ్చింది. గత వేతన ఒప్పందాలలో బెనిఫిట్‌ను లెక్కించకుండా (బేసిక్ ప్లస్ ఎస్‌డీఏ ప్లస్ బోనస్) మొత్తంపై కాకుండా కేవలం బేసిక్ మరియు వీడీఏ పైన మాత్రమే పెరుగుదల చూపిస్తూ మోసం చేయడానికి చూసే ప్రయత్నాలను యూనియన్లు తిప్పి కొట్టాయి. వివరాల పాత పద్ధతిలో 25శాతం మరియు 4 శాతం స్పెషల్ అలవెన్స్‌ల కంటే తక్కువగా పెంచితే ఒప్పుకునేది లేదని యూనియన్లు స్పష్టం చేశాయి. దీంతో కోలిండియా యాజమాన్యం బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని గత సమావేశంలో పేర్కొంది.

2016లో కోలిండియా, సింగరేణిలు కేంద్ర ప్రభుత్వానికి వివిధ ట్యాక్స్‌లు చెల్లించిన అనంతరం కూడా నికర లాభాలు రూ.15,340.13 కోట్లు ఉన్నాయి. ఇంత లాభాలలో ఉన్న సంస్థలలో ఆశించిన మేర వేతనాలు పెంచాలని యూనియన్‌లు కోరుతున్నాయి. ఈ సమావేశానికి సింగరేణి ప్రాంతం నుంచి వేతన కమిటి పర్మినెంట్ సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య (ఏఐటీయూసీ) మంద నర్సింహారావు (సీఐటీయూ), ప్రత్యామ్నాయ సభ్యులు రియాజ్ అహ్మద్ (హెచ్ఎంఎస్), లట్టి జగన్మోహన్ (బీఎంఎస్)లు హాజరు కానున్నారు. ఐఎన్‌టీయూసీ నుంచి జనక్‌ప్రసాద్ కూడా ప్రత్యామ్నాయ సభ్యుడిగా ఉన్నప్పటికి ఆ యూనియన్ విషయం కోర్టులో ఉన్నందున వారికి సమావేశంలో ప్రవేశానికి అనుమతి లేదు. సింగరేణి డైరెక్టర్ పర్సనల్ అండ్ ఫైనాన్స్ జె పవిత్రన్‌కుమార్, జీఎం పర్సనల్ ఆనందరావులు కూడా ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

'వారసత్వ హామీని నిలబెట్టుకోని టీబీజీకేఎస్'



7ఎల్ ఈపీలో మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ నాయకుడు దశరథంగౌడ్

యైటింక్లయిన్‌కాలనీ: వారసత్వ ఉద్యోగాలపై ఇచ్చిన హామీని టీబీజీకేఎస్ నిలబెట్టుకోలేదని హెచ్ఎంఎస్ ఆర్జీ-2 ఉపాధ్యక్షుడు దశరథం ఆరోపించారు. బుధవారం 7ఎల్ ఈపీలో జరిగిన గేట్‌మీటింగ్‌లో వీరస్వామి, యాదగిరి సత్యయ్యలతో కలిసి మాట్లాడారు. జాతీయసంఘాలే వీఆర్ఎస్ పోగొట్టాయని చెప్తున్న వెంకట్రావ్ మొన్నటిదాక అక్కడ పనిచేయలేదా అని ప్రశ్నించారు. టీబీజీకేఎస్‌కు వీఆర్ఎస్ తెచ్చే సత్తాలేదనే జాతీయ సంఘాలు సమ్మెకు దిగాయని పేర్కొన్నారు. యాజమాన్యంతో కలిసి సమ్మె విఫలం చేయడానికి టీబీజీకేఎస్ విఫలయత్నం చేసిందని ఆరోపించారు. వెంకట్రావ్ చైర్మన్‌పై ఒత్తిడి చేసి తమను బదిలీ చేయించినట్టు దశరథం ఆరోపించారు. లాభాల వాటా ఎగ్గొట్టడానికి ఈ ఏడాది రూ.356 కోట్ల నష్టం వచ్చినట్టు ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ మీటింగ్‌లో ప్రతాప్‌రావు, మధునయ్య, రామయ్య, పెరుమయ్య, ఆరిఫ్, లక్ష్మయ్య, సత్యనారాయణరెడ్డి, మొగిలిలు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు

● ఏజీఎం ఫణికుమార్

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులు కష్టపడి పని చేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని ఏజీఎం ఫణికుమార్ పేర్కొన్నారు. బుధవారం శ్రీరాంపూర్‌లోని ఆర్కే-8గని ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మికులకు సర్వీస్ లింక్డ్ ప్రమోషన్ పత్రాలు అందజేసి మాట్లాడారు. ఆర్కే-8గనిలో ఈ సంవత్సరం కూడా నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలన్నారు. కార్మికులు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. అనంతరం అధిక ఉత్పత్తికి కృషి చేసిన కార్మికులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏజెంట్ జాన్‌ఆనంద్, గని మేనేజర్ శ్రీనివాస్‌చారి, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఎస్ఓ విజయ్‌కుమార్, పిట్ ఇంజనీర్ భీమయ్య పాల్గొన్నారు.

జేఎంఈటీలకు బీ గ్రేడ్ ఇవ్వాలి

● ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి సమ్మయ్య



కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న సమ్మయ్య

శ్రీరాంపూర్: జేఎంఈటీలకు సంబంధించి ఐదు సంవత్సరాల బాండును తొలగించి గత అగ్రిమెంట్లకు అనుకూలంగా రెండు సంవత్సరాలకు బీగ్రేడ్ ఇవ్వాలని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య పేర్కొన్నారు. బుధవారం శ్రీరాంపూర్‌లోని ఆర్కే-6గనిని సందర్శించి నూతనంగా బాధ్యతలు చేపట్టిన జేఎంఈటీలు, బదిలీ వర్కర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జేఎంఈటీల, బదిలీ వర్కర్ల సమస్యలపై ఈ నెల 20న నర్సయ్య భవన్‌లో సమావేశం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. షాట్‌ఫైరర్‌గా పూర్తిస్థాయిలో వీరి సర్వీసును వాడుకుంటున్నందున ఇన్సెంటివ్, ఓటీ సౌకర్యం కల్పించాలన్నారు. రిజెక్టెడ్ క్వార్టర్లు కాకుండా వీరికి క్వార్టర్ సదుపాయం కల్పించాలని పేర్కొన్నారు. ఇతర మైనింగ్ సూపర్‌వైజర్ల మాదిరిగా సర్వీసు చేసుకుంటున్నందున లీవులు, ఎల్‌టీసీ తదితర సౌకర్యాలు పర్మినెంట్ మైనింగ్ ఉద్యోగిలాగా కల్పించాలన్నారు. పై చదువులకు ఎన్ఓసీ ఇవ్వాలని పేరొన్నారు. బదిలీ వర్కర్లకు 190మస్టర్లు కాగానే ప్రమోషన్ కల్పించాలన్నారు. అదనపు ఎస్‌డీఎల్ ఆపరేటర్‌గా వాడుకుంటున్న వీరికి 4లేదీ 5వ క్యాటగిరి యాక్టింగ్ ఇవ్వాలన్నారు. మైనింగ్ సూపర్‌వైజర్ ట్రైనింగ్ కల్పించి వారికి ప్రమోషన్ కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి ల్యాగల శ్రీనివాస్, ఇమ్మడిచెట్టి రాంచందర్, డీకొండ మల్లయ్య, సదానందం, పర్వతాలు, బూర్ల సత్యనారాయణ, రాయనర్సు ఉన్నారు.

సీఐటీయూ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను బుధవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా డివిజన్ కార్యదర్శి ఉల్లి మొగిలి మాట్లాడారు. బొగ్గు పరిశ్రమల కార్మికులపై ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నట్టు పేర్కొన్నారు. 10వ వేతన ఒప్పందం ఆలస్యం కావడం, ప్రతి మూడేళ్లకు ఒకసారి పెరగాల్సిన పెన్షన్‌ను 1998 నుంచి పెంచకపోవడం వంటి కారణాలతో కార్మిక వర్గం నష్టపోతున్నట్టు మొగిలి తెలిపారు. బొగ్గు బ్లాక్‌లను ప్రైవేట్ కంపెనీలకు అప్పచెప్పడంతో వాటి భవిష్యత్తు ప్రశ్నార్థకం కానున్నట్టు పేర్కొన్నారు. ఈనెల 21, 22 తేదీల్లో గోదావరిఖనిలో జరగనున్న రాష్ట్ర మహాసభల్లో ప్రస్తుతం కార్మికవర్గం ఎదుర్కొంటున్న సవాళ్ళు, హక్కుల సాధనకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నట్టు తెలిపారు.ఈకార్యక్రమంలో ఎస్ వెంకన్న, శంకర్, రాజేషం, భూమయ్య, లక్ష్మీరాజం పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

'అధిక పని భారం మోపడం తగదు'

శ్రీరాంపూర్: జేఎంఈటీలపై అధిక పని భారం మోపడం తగదని ఏఐటీయూసీ బెల్లంపల్లి ఏరియా మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జీ వంగరి రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. బుధవారం శ్రీరాంపూర్‌లోని ఆర్కేన్యూటెక్ గనిని సందర్శించి జేఎంఈటీ, డిప్లోమాహోల్డర్ల సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. జేఎంఈటీలలో గ్యాస్ టెస్టింగ్ లేకున్నా బ్లాస్టింగ్ చేయిస్తూ కన్వర్జెన్స్‌కి పంపిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి జేఎంఈటీలపై అధిక పనిభారం మోపకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గొర్రె నర్సయ్య, సారేందర్, నర్సయ్య, శాంతయ్య, చక్రపాణి, నారాయణలు పాల్గొన్నారు.

'పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం'

మందమర్రి: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని మందమర్రి ఏరియా జీఎం రాఘవులు పేర్కొన్నారు. బుధవారం ఏరియాలోని కేకే1గనితో పాటు స్థానిక సింగరేణి పాఠశాల ఆవరణములో యాజమాన్యం చేపట్టిన స్వచ్ఛభారత్ పక్షోత్సవాలలో భాగంగా చెత్త చెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ గోవిందరాజు, ఐఈడీ రాజన్న, గుర్తింపు సంఘం ఏరియా ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్ లు పాల్గొన్నారు.



సింగరేణి పాఠశాలలో చెత్తను తొలగిస్తున్న మందమర్రి జీఎం రాఘవులు

రెబ్బెన: స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో అందరు భాగస్వాములు కావాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిశంకర్ అన్నారు. బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల, ఆరోగ్యకేంద్రంలో ఏరియా జనరల్ మేనేజర్ రవిశంకర్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిసరాలనుపరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్యకేంద్రం పరిసరాలలో ఉన్న చెత్తా చెదారాన్ని తీసివేశారు. అనంతరం సింగరేణి పాఠశాల ఆవరణలోని ప్లాంటేషన్‌లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షురాలు అనురాధ, ఎస్ఓటు జీఎం కొండయ్య, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సదాశివ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'స్వచ్ఛపక్వాడలో భాగస్వాములు కావాలి'

శ్రీరాంపూర్: స్వచ్ఛపక్వాడ కార్యక్రమంలో అందరు భాగస్వాములు కావాలని శ్రీరాంపూర్ జీఎం సుభాని పిలుపునిచ్చారు. బుధవారం శ్రీరాంపూర్‌లోని జీఎం కార్యాలయంలో అన్ని గనులు, విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛపక్వాడ కార్యక్రమాన్ని ఈ నెల 18,19తేదీల్లో అన్ని గనులు, డిపార్టుమెంట్లపై నిర్వహిస్తూ కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని గనులు, డిపార్టుమెంట్లపై పరిశుభ్రతతో పాటు కాలనీల్లో కూడా కార్మికులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో ర్యాలీలు చేపట్టాలని పేర్కొన్నారు.

క్యూలెక్స్ కాటేస్తోంది..



కొండపల్లి గ్రామం

(ఆంధ్రజ్యోతి, ఆసిఫాబాద్)

కుమరం భీం జిల్లాను ఒక కిడ్నీ వ్యాధే కాదు.. క్యూలెక్స్ దోమలతో వ్యాపిస్తున్న ఫైలేరియా, దుమ్ము ధూళి వల్ల క్షయవ్యాధి భారీగానే విస్తరిస్తోంది. ఏజెన్సీ అంతటా ఇంచుమించు ఒకే రకమైన పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రత్యేకించి రెబ్బెన మండలం కొండపల్లి, కౌటాల మండలం మొగడ్దగడ్ గ్రామాలను ఫైలేరియా కబళిస్తుండడం అటు వైద్య నిపుణులను ఇటు అధికార యంత్రాన్ని కలవర పెడుతోంది. ఈ రెండు గ్రామాల్లో కలిసి సుమారు 50 మందికి పైగానే బోదకాలతో బాధపడుతున్నట్లు 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో తేలింది. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో లభించిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. కుమరం భీం జిల్లా రెబ్బెన మండలం కొండపల్లి గ్రామానికి చెందిన 25 మందికి ఈ వ్యాధి సోకింది. కౌటాల మండలం మొగడ్దగడ్ గ్రామంలో దాదాపు 30మందికి ఈ వ్యాధి సోకింది. రెండున్నర దశాబ్దాలుగా ఫైలేరియా మహమ్మారి ఈ గ్రామాల్లో బాధితులను ఇబ్బంది పెడుతుండగా అప్పట్లోనే గుర్తించి అధికార యంత్రాంగం నివారణ చర్యల్లో భాగంగా బాధితులకందిస్తున్న మెడికల్ కిట్లు క్రమం తప్పకుండా ఉపయోగిస్తున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదనేది బాధితుల ఆవేదన. సాధారణంగా క్యూలెక్స్ దోమలు కొండ ప్రాంతాలు, నీటి మడుగుల సమీపంలోనే ఎక్కువగా ఉంటాయి. చాలా అరుదుగా ఉండే ఈ దోమలు బాధితులను కాటేసినప్పుడు ప్రాథమిక దశలో తీవ్రమైన జ్వరంతో కూడి నొప్పి ఉంటుంది. క్రమంగా కాటువేసిన ప్రాంతంలో జ్వరంతో పాటు వాపు రావడం తరచూ నొప్పి వస్తూ పోతూ వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఫైలేరియా నివారణకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేకంగా క్యాంపెన్‌లు నిర్వహిస్తూ డీఈసీ మాత్రలను పంపిణీ చేస్తున్నప్పటికీ కొన్ని సందర్భాల్లో ఆ మాత్రలు వికటిస్తుండడం వల్ల ప్రజలు వాటిని వేసుకునేందుకు జంకుతున్నారు. మందులు వేసుకోని ఫలితంగా ఫైలేరియా కొత్తవారికి సోకుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. కుమరంభీం జిల్లాలో ఈ వ్యాధి తీవ్రత ఏయేటికాయేడు పెరుగుతుండడం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఇప్పటికే జిల్లాలో రక్తహీనత, కిడ్నీ సంబంధిత వ్యాధులు, తీవ్రమైన క్షయ పీడిస్తోంది. దానికి అదనంగా బోదకాలు విస్తరిస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. బోదకాల కారణంగా రోజువారి పనులు చేసుకుంటే తప్ప పూటగడవని కూలీలు బయటకు పోలేని దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నారు. నడిస్తే చాలు కాళ్ల వాపులు ఎక్కువై విపరీతమైన నొప్పి వస్తుంటుందని చెబుతున్నారు. ఈ గ్రామాల్లోన్ని వారంతా రైతులు, వ్యవసాయ కూలీలు. వీరికి రెక్కాడితే కానీ డొక్క నిండదు. పంట చేనులలో పనులు చేసుకుని ఇంటికి వచ్చిన తరువాత కాళ్ల నొప్పులు భరించలేకుండా ఉంటాయని బాధితులు తెలిపారు. కొన్ని సమయాల్లో విపరీతమైన జ్వరం, వాంతులు, విరేచనాలు, ఒళ్లు నొప్పులు, తల నొప్పి వస్తుందని తెలిపారు. బాధ భరించలేక పోతున్నామని వారు ఆంధ్రజ్యోతితో తమ గోడు వెళ్లబోసుకున్నారు.

ఫైలేరియా బాధితులు వీరే..

రెబ్బెన మండలం కొండపల్లి గ్రామంలో బోధకాలతో బాధపడుతున్న వారిలో.. గుర్లె శోభ(25), ఇగురపు పార్వతి(40), ఇగురపు లక్ష్మి(45),గుర్లె పుల్లూబాయి(45), మెంగుబాయి(55), మొర్లె తిరుపతి(65), గుర్లె విమల(45), గుర్లె అంకుబాయి(65), వడాయి గంగుబాయి (45), గుర్లె లక్ష్మి(45), లెండుగురె తిరుబాయి(40), తానుబాయి(45), కమల(40), యశోద(45), చునార్కర్ మనోహర(30), వడాయి నీలబాయి(40), గుర్లె లక్ష్మిబాయి(55), ఎల్.భాగ్య(35), ఆరె మల్లుబాయి(65), నికోడే లక్ష్మి(35), ధాక్రె మంజుల(45), దుట లక్ష్మి(45), ఇరుగుల లలిత(38) బోదకాలతో బాధపడుతున్నారు. కౌటాల మండలం మొగడ్దగడ్ గ్రామంలో బోయిర్ బాహుజీకి బోదకాల వ్యాధి రాగా ఇటీవలే అతని కుమారుడు బోయర్ దివాకర్‌కు ఈ వ్యాధి సోకింది. బాహుజీ చెల్లెలు చునార్కర్ విమలబాయికి బోదకాల వ్యాధి వచ్చింది. వీరు ఒకే కుటుంబానికి చెందిన వారు కాగా వీరితో పాటు ఎలకార్ గోండిరాం, బోయర్ దత్తు, చాప్లె సుశీల, పద్మ, దోబె లక్ష్మిబాయి, మంగుబాయి, ఎలకార్ మంగళబాయి, ఎలకార్ సంతోష్, ఎలకార్ విశ్వనాథ్, చందన్‌కార్ ఆనంద్‌రావులు బోధకాల వ్యాధితో బాధపడుతున్నారు. వీరే కాక మొగడ్దగడ్ గ్రామంలో ఏ వాడలో చూసినా బోదకాల వ్యాధిగ్రస్తులే దర్శనమిస్తున్నారు. ఇదే గ్రామంలో బోదకాల వ్యాధితో ఇటీవలే పరదేశి అనే వ్యక్తి మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి..

- సీహెచ్ యశోద, కొండపల్లి



బోదకాల వ్యాధితో తీవ్రఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి మెరుగైన వైద్య సేవలు అందించాలి. వ్యాధి మూలంగా పనులను సక్రమంగా చేసుకోలేకపోతున్నాం. గ్రామంలో అవగాహన సదస్సులు సైతం నిర్వహించి ఇతరులకు వ్యాధి సోకకుండా అధికారులు తగు జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాలి.

పదిహేనేళ్లుగా బాధపడుతున్నా..

- గంగుబాయి, కొండపల్లి



పదిహేను సంవత్సరాల క్రితం బోదకాల వ్యాధి సోకింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు వ్యాధి మూలంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాను. అధికారులు, వైద్య సిబ్బంది అప్పుడప్పుడు వచ్చి కొంత అవగాహన కల్పిస్తున్నప్పటికీ మెరుగైన వైద్యం మాత్రం అందించడం లేదు. నామ మాత్రంగా ఒక్కసారి బోదకాల కిట్ ఇచ్చి వెళ్లారు. వారిచ్చిన సలహాలు, సూచనలు పాటిస్తున్నప్పటికీ వ్యాధి తగ్గడం లేదు.

కూలీ పనులు చేసుకోలేకపోతున్నాం..

- తార, కొండపల్లి



బోదకాల వ్యాధి తీవ్రత మూలంగా కూలిపనులకు వెళ్లలేక పోతున్నాం. కాళ్ల వాపుతో పాటు బరువు పెరిగి నడవడం కష్టంగా మారింది. దీంతో ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బోధకాల వ్యాధి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని వ్యాధి ఉన్నవారిని ప్రత్యేక కోటాలో వికలాంగులుగా గుర్తించి పెన్షన్ సౌకర్యం కల్పించాలి.

నరకం అనుభవిస్తున్నాం..

- దాదాజీ, మొగడ్దగడ్



ప్రాణంతో ఉన్నప్పుడే నరకం అంటే ఏందో తెలుస్తుంది. నాకు రెండు కాళ్లకు బోదకాలు వచ్చింది. ఏం పని చేసినా, నడిచి వెళ్లినా కాళ్లు వాపులు వస్తున్నాయి. రాత్రంతా నొప్పులు, పెయ్యంతా జ్వరం ఉండడంతో చేను పనులకు వెళ్లలేకపోతున్నాం. ఎటూ నడుస్త లేను. ఇంటికాన్నే ఉంటున్నా. బాగా ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

ఇంట్లో పని కూడా చేస్త లేను..

- చాప్లె సుశీల, మొగడ్దగడ్



నాకు బోదకాలు వ్యాధి వచ్చినప్పటికీ చాలా ఇబ్బంది అవు తుంది. ఎడమ కాలు, కుడి చెయ్యి రెంటికి ఈ రోగం వచ్చింది. దీనితో కనీసం ఇంట్లో వంట కూడా చెయ్యరావడం లేదు. ఇంట్లో పని చేసినా కానీ కాలు, చెయ్యి వాపులు, నొప్పులు బాగా వస్తాయి. అందుకే ఏం పని చేస్త లేను. నా రోగం ఎప్పుడు తగ్గుతుందో..

చావుకు దగ్గరవుతున్నా

- బోయర్ బాహుజీ, మొగడ్దగడ్



నాకు రెండు కాళ్లకు బోదకాల రోగం వచ్చింది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా రోగం పోతలేదు. రోగం పోదు కానీ చావుకు దగ్గరవుతున్నా. కాళ్ల నొప్పులతో నడవలేకపోతున్నాం. కట్టె పట్టుకుంటేనే ఇంటి నుంచి బయటకు రావాలి. మా గురించి అధికారులు, ప్రజాప్రతినిదులు పట్టించుకుంట లేరు. ఏళ్ల తరబడి ఆసుపత్రులకు తిరిగి డబ్బులు ఖర్చు అవుతున్నాయని తప్ప రోగం నయం కావడం లేదు. ఇక మాకు ఆ దేవుడే దిక్కు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

సిర్పూర్(యు): భూసమస్యల పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రత్యక కార్యక్రమం చేపడుతుందని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని సిర్పూర్ (యు) గ్రామపంచాయతీ పరిధిలో గల రాఘుపూర్‌లో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు తమ భూవివరాలపై సమస్యలు ఉంటే సరిచేసుకోవాలన్నారు. అదేవిధంగా విరాసత్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లయితే వెంటనే తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. భూమి సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి సమస్యలు సరిచేయడానికి తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామారావు, ఆర్‌ఐ సంతోష్, సిబ్బంది ఉమాదేవి, కార్యదర్శులు శంకర్, దిలీప్, గ్రామస్థులు లచ్చు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్

ఎంప్లాయీస్ యూనియన్ గేటు ధర్నా



డిపో గేటు ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న సమస్యలు, రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు బుధవారం ఆర్టీసీ డిపో గేటు ఎదుట ఎంప్లాయీస్ యూనియన్ కార్మికులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ కార్యదర్శి దివాకర్, డిపో కార్యదర్శి ఎజాజ్ హుస్సేన్, కోశాధికారి లక్ష్మణ్, కార్మికులు ప్రభాకర్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐఓఎస్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి



సామగ్రిని అందజేస్తున్న కలెక్టర్ చంపాలాల్

ఆసిఫాబాద్‌రూరల్: కుమరం భీం జిల్లా ఆసిఫాబాద్‌లో ఈ నెల 20న నిర్వహించే ఎన్ఐఓఎస్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్)అర్హత పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చంపాలాల్ అన్నారు. ఈ సందర్భంగా పరీక్షకు సంబంధించిన కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా మండలాల ఎంసీఓలు వైరగారే ప్రతాప్, రవీందర్, రాజేంద్రప్రసాద్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: మహత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో బేర్‌ఫూట్ టెక్నిషియన్‌గా పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సివిల్ ఇంజనీరింగ్ డిప్లొమా కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 44 వయస్సు కలిగి ఉండాలన్నారు. స్థానికులై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు 2015, 16, 17-18 జూన్ నాటికి ఉపాధిహామీ పథకంలో కనీసం ఒకరోజు పనిచేసి ఉండాలన్నారు. జిల్లాలో మొత్తం ఖాళీలు 12 ఉన్నాయని, ఇందులో ఎస్సీలకు ఒకటి, ఎస్టీలకు 11 కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు ఈనెల 23లోపు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఆదిలాబాద్.తెలంగాణ.జిఓవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

నేడు విద్యార్థుల వివరాలు అందజేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని అన్ని యాజమాన్య ప్రాథమికోన్నత, సెకండరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తరగతులవారీగా విద్యార్థుల సంఖ్య, మీడియం వివరాలను గురువారం సాయంత్రంలోగా కార్యదర్శి డీసీఈబీ, జిల్లా విద్యాశాఖ కార్యలయంలో అందజేయాలని డీఈఓ ఎంఏ రఫీక్ ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాల పునఃప్రారంభం

జైనూర్: మండలములోని జెండాగూడ గ్రామ పంచాయతీ లోగల మోతిపటేల్‌గూడలో బుధవారం గిరిజన సంక్షేమశాఖ ప్రాథమిక పాఠశాలను సర్పంచ్ జాదవ్ రూక్మాబాయి ప్రారంభించారు.ఈ పాఠశాలను కొద్దిరోజుల క్రితం విద్యార్థులు లేరనే సాకుతో రద్దుచేశారని వాస్తవంగా 30మంది విద్యార్థులున్నట్లు సర్పంచ్ తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయుడు అధికారులకు తప్పుడు సమాచారం ఇవ్వడంతో పాఠశాలను ఎత్తివేశారని, ప్రభుత్వం పాఠశాలను పునఃప్రారంభించడంతో పిల్లలకు న్యాయం జరిగిందని, ఇందుకు సహకరించిన ఎస్‌సీఈఆర్‌పీ శంకర్, హెచ్ఎం పర్శురాం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ రాజమ్మ, సీఆర్‌టీ కల్పన తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మగ్గంపై శిక్షణ

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మహిళ కళాంజీయం సమైఖ్య(ధాన్ ఫౌండేషన్) ఆధ్వర్యంలో గురువారం నుంచి మగ్గంపై శిక్షణ ఇవ్వనున్నట్లు ధాన్ ఫౌండేషన్ ప్రతినిధి విలాస్‌రావు, సమైఖ్య ఆధ్యక్షురాలు మంజుల ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7732030316, 9959044969ల్లో సంప్రదించాలన్నారు.

వణుకుపుట్టిస్తున్న

వయ్యారిభామ

● పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం ● మనుషులకూ అనారోగ్యం


దిలావర్‌పూర్‌లో సోయా పంటను కప్పేసిన వయ్యారి భామ

దిలావర్‌పూర్ : వయ్యారి భామ.. పేరు ముచ్చటగా ఉన్న ఈ మొక్క వల్ల పంటలకు, పశువులకు, మనుషులకు పొంచి ఉన్న ముప్పు అంతా ఇంతా కాదు. అత్యంత వేగంగా విస్తరించే ఈ కలుపు మొక్క, పంట దిగుబడులను సగానికి సగం తగ్గించగలదు. వయ్యారి భామ ఉన్నచోట తిరిగితే మనుషులకు చర్మ, శ్వాససంబంధ వ్యాధులు సోకుతాయి. మేసిన పశువులకు ప్రాణహాని కలుగుతుంది. అందువల్ల ఈ మొక్క ఎక్కడ కనిపించినా ఆలస్యం చేయకుండా పీకివేయాలని వ్యవసాయశాస్త్రవేత్తలు చెబుతున్నారు.

● ఈ మొక్కకు ఎన్నోపేర్లు..

ఈ మొక్కను మన రాష్ట్రంలో చాలా పేర్లతో పిలుస్తారు. అమెరికా అమ్మాయి, కాంగ్రెస్ గడ్డి, క్యారెట్ గడ్డి, నక్షత్రగడ్డి, చతక్ చాందిని, గజర్, అపాదిమొక్క, ముక్కుపుడకల గడ్డి ఇలా ప్రాంతాలను బట్టి పేర్లున్నాయి. జిల్లాలో మాత్రం వయ్యారి భామ, ముక్కుపుడకలగడ్డి అని పిలుస్తారు. దీని శాస్త్రీయనామం పార్థనీయం హిస్టోరోఫోరెస్.

● మనదేశంలోకి ఇలా..

వయ్యారిభామను తొలుత అమెరికాలోని ఉష్ణప్రాంతంలో కనుగొన్నారు. అక్కడి నుంచి ఆహారధాన్యాలతోపాటు మన దేశానికి దిగుమతైంది. 1973లో ఈ మొక్క మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాల్లో కనిపించింది. వయ్యారి భామ విత్తనాలు గాలిద్వారా సుమారు మూడు కిలోమీటర్ల వరకువ్యాపిస్తాయి.

● మనుషుల ఆరోగ్యంపై ప్రభావం..

వయ్యారిభామ మనుషుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రమాదకరమైన డర్మాటైటిస్, ఎగ్జిమాహైఫీవర్, ఉబ్బసం, బ్రాంకైటీస్ వ్యాధులు వచ్చే ప్రమాదముంది. ఈ మొక్క ఆకులను చర్మానికి రాస్తే తామర వస్తుంది. ఈ పూల పుప్పొడితో జలుబు, కళ్లు ఎర్రబడడం, కనురెప్పలు వాపు వస్తాయి. జంతువులు మేసినప్పుడు వెంట్రుకలు రాలిపోవడం, హైపర్ టెన్షన్ పెరుగుతుంది.. పశువుల పాల ఉత్పత్తి తగ్గి, జ్ఞాపకశక్తి దెబ్బతింటుంది. వయ్యారిభామ మొక్కను తిన్న పశువుల జీర్ణక్రియ, కిడ్నీ, కాలేయం, అన్నవాహిక, శ్వాసనాళం దెబ్బతినే ప్రమాదముంది. పొలాల్లో పని చేసిన రైతులు, కూలీలకు చర్మ, శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చేఅవకాశముంది.

● అపార పంటనష్టం...

వయ్యారి భామ అత్యంత ప్రమాదకరమైన కలుపు మొక్క. ఇది స్రవించే కొన్ని రకాల రసాయనాల వల్ల పంటల పెరుగుదల నశిస్తుంది. పూత, పిందెలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం 40 శాతం నుంచి 50 శాతం వరకు పంట దిగుబడిని తగ్గిస్తుంది. నేలలో నత్రజని, పోషకవిలువలు, సూక్ష్మదాతువుల శాతాన్ని తగ్గిస్తుంది. పత్తి, కూరగాయలు, మామిడి, సొయాబీన్, పూల తోటల్లో విస్తృతంగా పెరుగుతుంది. కొన్ని రకాల వైరస్ తెగుళ్ల వ్యాప్తికీ వయ్యారిభామ కారణమవుతుంది.



నివారణ ఇలా.. : ఏ స్రవంతి, ఏవో, దిలావర్‌పూర్

పంటచేలల్లో వయ్యారిభామ విస్తరించకుండా రైతులు తగిన చర్యలు తీసుకోవాలి. మెట్టభూముల్లో పూతకుముందే మొక్కలను పీకేసి, తగులబెట్టాలి. అప్పుడు వచ్చే పొగ ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపుతుంది కనుక దూరంగా ఉండాలి. బురద నేలల్లో లోపలకు తొక్కేయాలి. అప్పుడది ఎరువుగా మారే అవకాశముంది. ఈ వయ్యారిభామను నిలువరించే శక్తి కేవలం తంగేడు మొక్కకు మాత్రమే ఉంది. అందువల్ల పొలాల గట్లు, బంజరు భూముల్లో తంగేడు చెట్లను తొలగించవద్దు. ఈ కలుపు మొక్క పూతకు రాక ముందే 10 లీటర్ల నీటిలో 5 కిలోల ఉప్పు కలిపిన ద్రావాణాన్ని పిచికారీ చేయాలి.


క్యూ కాంప్లెక్స్ లేకపోవడంతో ఒకేసారి ఆలయంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్న భక్తులు (ఫైల్)

సమస్యల ఒడిలో చదువులమ్మ గుడి!

● బాసర పుణ్యక్షేత్రంలో కనీస వసతులు కరువు ● చిన్నారులతో భక్తుల నానాపాట్లు ● కాగితాలకే పరిమితమైన మాస్టర్ ప్లాన్ ● అభివృద్ధికి నోచుకోని అరుదైన దేవాలయం

బాసర : బాసరలోని జ్ఞానసరస్వతీ ఆలయం అభివృద్ధికి ఆమడదూరంలో అల్లాడుతున్నది. రాష్ట్రానికే తలమానికమైన ఈ చదువులమ్మ గుడిలో కనీస వసతులు కరువయ్యాయి. దీంతో తెలంగాణ నలుమూలల నుంచేగాక వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తులు నానాపాట్లు పడుతున్నారు. మరోవైపు దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశాల మేరకు రూపొందిన మాస్టర్ ప్లాన్ కాగితాలకే పరిమితమైంది. 'ఇదిగో.. అదిగో' అంటూ అధికార పార్టీ నేతలు ఊరిస్తున్న 'ముఖ్యమంత్రి పర్యటన'నకు అతీగతీ లేకుండా పోయింది.

● అడుగడుగునా నరకం..

సాధారణ రోజుల్లో సుమారు 10 వేల మంది భక్తులకు తగ్గకుండా అమ్మవారిని దర్శించుకుంటారు. అక్షరశ్రీకార పూజలకు శుభముహూర్తాలు ఉన్న రోజుల్లో, వేసవి పరీక్షా సమయాల్లో, ఉత్సవాల్లో భక్తులరద్దీ అధికంగా ఉంటుంది. కానీ కనీస వసతులు లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయ ప్రాంగణం ఇరుకుగా ఉండడం, క్యూ కాంప్లెక్స్ లేకపోవడం, ప్రత్యేక అక్షర శ్రీకార మండపం చిన్నదిగా ఉండడం, భక్తుల విశ్రాంతి కోసం, విడిది కోసం గదులు లేకపోవడంతో నానాపాట్లు పడుతున్నారు. కనీసం ఆలయం వద్ద మరుగుదొడ్లు, మూత్రశాలలు, బస్టాండ్ లాంటివి లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. దేవస్థానం పరిధిలో 90 గదులు మాత్రమే ఉన్నాయి. వీటిని వీఐపీలకు, పరిచయస్తులకే కేటాయిస్తున్నారు. పదిహేనేళ్ల కిందట చేసిన అభివృద్ధి పనులే తప్ప పెరుగుతున్న భక్తుల రద్దీకనుగుణంగా వసతులు ఏర్పాటుచేయకపోవడం వల్లే నానా సమస్యలు వస్తున్నాయి. ఉత్సవాలు, రద్దీ సమయంలో తాగునీరు, మరుగుదొడ్లు, కనీసం కూర్చునే సౌకర్యం లేని క్యూ లైన్లలో భక్తులు గంటల తరబడి వేచిచూస్తూ నరకం అనుభవిస్తున్నారు. చిన్నపిల్లలతో వారు పడే బాధలు వర్ణనాతీతం. గత ఫిబ్రవరిలో వసంతపంచమి వేడుకల సందర్భంగా భక్తులు ఇబ్బందులు భరించలేక ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.


బాసర సరస్వతీ దేవాలయం

రద్దీ దినాల్లో భక్తుల పరిస్థితి ఇది (ఫైల్)


పిల్లా పాపలతో భక్తుల కష్టాలు (ఫైల్)

● సీఎం పర్యటనపైనే ఆశలు..

జిల్లాకు చెందిన దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశాల మేరకు రెండేళ్ల కింద అధికారులు ఆలయ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ఇందుకు రూ. 126 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. దీంతో పాటు గతేడాది సెప్టెంబర్ 20న యాదాద్రి ఆలయ ప్రణాళికను రూపొందించిన ఆనందసాయి నేతృత్వంలో ఇంజనీర్ల బృందం బాసరను సందర్శించింది. ఈ సందర్భంగా ఆలయం అంతా తిరిగి భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆలయాన్ని పూర్తిగా విస్తరించాలని సూచించారు. మరోసారి సందర్శించి ప్రణాళికలను రూపొందిస్తామని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటివరకు బాసర అభివృద్ధిపై అడుగు ముందుకు పడలేదు. మూడేళ్ల నుంచి బాసరకు ముఖ్యమంత్రి వస్తారంటూ అధికార పార్టీ నేతలు ప్రకటిస్తూనే ఉన్నారు. దీంతో ముఖ్యమంత్రి పర్యటనపై స్థానికులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఆయన వస్తే ఆలయ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తారని భావిస్తున్నారు.

● అక్కడ అలా.. ఇక్కడ ఇలా

విభజన అనంతరం పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సరస్వతి ఆలయం లేకపోవడంతో అక్కడి ప్రభుత్వం సుమారు రూ.30 కోట్లతో గోదావరి తీరంలో రాజమండ్రి వద్ద పెద్ద సరస్వతి ఆలయాన్ని నిర్మిస్తున్నది. ఇప్పటికే అక్కడి పండితులు బాసరకు వచ్చి ఇక్కడి ఆలయ నమూనా, ప్రతిరోజూ నిర్వహించే పూజల వివరాలను తెలుసుకొని వెళ్లారు. కానీ మన రాష్ట్రంలో ఈ ప్రాచీన ఆలయం అభివృద్ధిపై ఇక్కడి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా పోయింది.



యాదాద్రి తరహాలో అభివృద్ధి చేయాలి : శ్రీనివాస్‌యాదవ్, బాసర

రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చొరవతో యాదాద్రి, భద్రాద్రి, వేములవాడ ఆలయాలను అభివృద్ధి చేస్తున్నది. వాటి తరహాలోనే బాసర సరస్వతీ ఆలయాన్ని కూడా అభివృద్ధి చేయాలి. వచ్చిన భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలి.



దేవాలయ ప్రాముఖ్యతను గుర్తించాలి

- ఓంకార్, బాసర

బాసర సరస్వతీ దేవాలయం దేశంలోనే రెండో అతిపెద్దది. ఇలాంటి దేవాలయం తెలంగాణలో ఉండడం మనకు గర్వకారణం. అందువల్ల ఈ ఆలయ ప్రాముఖ్యతను గుర్తించి, అన్నివిధాలా అభివృద్ధి చేయాలి.

ఇదో 'హరిత' ఠాణా!

● నందనవనంలా ఈసుగాం పోలీస్‌స్టేషన్
● పూల మొక్కలు, పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం

కాగజ్‌నగర్ రూరల్ : చుట్టూ పూల మొక్కలు, పచ్చని చెట్లతో ఆ పోలీస్ స్టేషన్ నందనవనాన్ని తలపిస్తున్నది. పోలీసుల ప్రత్యేక శ్రద్ధతో ఠాణా చుట్టూ పచ్చదనం పరుచుకోగా, ఆహ్లాదకర వాతావరణం నెలకొన్నది.


పూల మొక్కలతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్న ఈసుగాం పోలీస్ స్టేషన్



ఈసుగాం పోలీస్ స్టేషన్

ఈసుగాం పోలీస్ స్టేషన్‌లోకి అడుగుపెట్టగానే పచ్చనిచెట్లు, పూల మొక్కలు స్వాగతం పలుకుతాయి. ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన ఎస్సైలతో పాటు ప్రస్తుత ఎస్సై సుధాకర్ ప్రత్యేక శ్రద్ధతో ఆవరణంతా పచ్చదనంతో కళకళలాడుతున్నది. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన హరితహారం కార్యక్రమంలో ఇక్కడి పోలీసులు మొదటి నుంచీ చురుగ్గా పాల్గొంటున్నారు. పోలీస్‌శాఖ ద్వారా చుట్టుపక్కల గ్రామస్థులకు మొక్కలు పంపిణీ చేయడమేగాక మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. పంచగా మిగిలిన మొక్కలను ఠాణా ఆవరణలో నాటి, సంరక్షిస్తున్నారు.

రోజూ పోలీసులే ఉదయం, సాయంత్రం మొక్కలకు నీళ్లు పోస్తూ, కలుపు తీస్తున్నారు. ప్రస్తుతం ఠాణా ఆవరణలో గులాబీ, మల్లె, కనకాంబరం, లిల్లీలాంటి పూలమొక్కలతో పాటు వివిధ అలంకరణ మొక్కలు, సందర్శకులకు ఆహ్లాదం పంచుతున్నాయి. వేప, జామ, మామిడి, మునగ, నిమ్మ, దానిమ్మ పండ్ల చెట్లు కూడా ఏపుగా పెరిగి, చల్లని నీడనిసు_న్నాయి.



మొక్కలంటే చాలా ఇష్టం..

- సుధాకర్, ఎస్సై, ఈసుగాం

